అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :300 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 11-02-2025 | పేజీలు:4 వెల: 2.00

మాదారం అడవుల్లోకి పెద్దపులి ప్రవేశం..

తాండూర్ : మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రేంజ్ పరిధిలో దాదాపు 12 రోజుల పాటు సంచరించిన పెద్దపులి ఆదివారం రాత్రి మాదారం అడవుల్లోకి ప్రవేశించింది. కన్నాల–బుగ్గ అటవీ ప్రాంతంతో పాటు కాసిపేట వైపు సంచరించిన ఈ పులి కన్నాల అడవుల మీదుగా మాదారం బీట్ వైపు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. పాదముద్రల ఆధారంగా ట్రాకింగ్ బృందం పులి ఎటు వైపు వెళ్లిందనే అంశం పై ఎప్పటికప్పుడు అధికారులకు, సమీప గ్రామాల ప్రజలకు సమాచారం అందిస్తున్నామని తెలిపారు.పెద్దపులి ఆదివారం బుగ్గదేవాలయం సమీపంలోని కొండపోచమ్మ గుడి పక్క నుంచి అంకుశం గుట్టల మీదుగా తాండూర్ మండలంలోని మాదారం ప్రాంతంలోని గొంతెమ్మ గుట్టల ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు పులి పాద ముద్రలు గుర్తించారు. ఈ అటవీ ప్రాంతంలో నీటి కుంటలు, పత్తి చేన్లు పెద్దపులికి అనుకూల ఆవాసంగా ఉన్నాయని పేర్కొన్నారు. పులి తిర్యాని వైపు లేదా రెబ్బెన మండలం పులికుంట వైపు వెళ్లి ఉండవచ్చనే కోణంలో పులి పాదముద్రలు గుర్తిస్తూ అటవీశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.వేటగాళ్ల నుంచి పెద్దపులిని రక్షించేందుకు ఎనిమల్ ట్రాకింగ్ టీంతో క్షణక్షణం అటవీ ప్రాంతంలో పులిని పర్యవేక్షిస్తున్నారు.

ఐఫోన్‌కు చైనా ఫోన్‌కు ఎంత తేడా ఉందో.. కేసీఆర్, రేవంత్‌కు అంతే తేడా ఉంది

హైదరాబాద్, ఐఫోన్‌కు చైనా ఫోన్‌కు ఎంత తేడా ఉందో.. కేసీఆర్, రేవంత్‌కు అంతే తేడా ఉందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. చైనా ఫోన్ చూడడానికే బాగుంటుంది.. కానీ సరిగ్గా పనిచేయదన్నారు. మాటలు చెప్పి బీసీల ఓట్లు వేయించుకొని బూరడి కొట్టిన సీఎం రేవంత్ రెడ్డి.. ఏ కులంలో ఎంత జనాభా ఉన్నారో లెక్కలు ఎందుకు బయటపెట్టడం లేదు? అంటూ ప్రశ్నించారు. జగిత్యాలలో కవిత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తూతూమంత్రంగా మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంఘాలతో సమావేశం పెట్టారని.. స్వయంగా ముఖ్యమంత్రి ఎందుకు సమావేశమవ్వడం లేదు ? ప్రశ్నించారు. బీసీ ఉద్యమం చేస్తున్న నాయకులతో ముఖ్యమంత్రి మాట్లాడకపోవడం బీసీలను అవమానించడమేనన్నారు.బీసీ కుల సంఘాలతో ముఖ్యమంత్రి చర్చలు జరపాలని.. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే వరకు ఉద్యమం ఆగదరన్నారు. మరో తెలంగాణ పోరాటం తరహా పోరాటానికి బీసీలంతా సిద్ధంగా ఉండాలని.. తప్పుడు జనాభా లెక్కలు చెప్పడంతో బీసీ సమాజం అట్టుడుకుతోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే బీసీ కుల సంఘాలతో చర్చలు జరపాలని.. 52 శాతం బీసీలు ఉన్నారని 2014లోనే కేసీఆర్ లెక్క తేల్చారని.. కానీ లెక్కపెట్టడం కూడా రాని రేవంత్ రెడ్డి సర్కారు తప్పుడు లెక్కలు చెబుతోందన్నారు. బీసీల సంఖ్యను తక్కువ చూపించడం శోచనీయమన్నారు. ఈ తప్పుడు లెక్కలు చెప్పి రాహుల్ గాంధీ పార్లమెంట్‌ను తప్పదోవ పట్టించారని.. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి బిల్లు ఎందుకు పెట్టడం లేదు ? అంటూ నిలదీశారు.420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను వంచించిందని.. ఎండిపోయిన పోలాలను చూపిస్తూ రైతులు బాధపడుతున్నారన్నారు. ఎండిన పంటపొలాలను చూస్తుంటే కన్నీళ్లు వచ్చే పరిస్థితి కేసీఆర్‌పై అక్కసుతో మేడిగడ్డ ప్రాజెక్టును వినియోగించడం లేదని.. రైతులను నీళ్లించే తెలివి లేదంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షను పక్కనపెట్టి సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం నీళ్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.సీఎం రేవంత్‌రెడ్డి ఆడపిల్లలు స్కూటీలు ఇస్తామన్నారని.. మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పి ఇంకా ఇవ్వలేదన్నారు. మహిళలను చిన్నచూపు చూస్తున్న రేవంత్ రెడ్డికి కాలం గుణపాఠం చెబుతుందన్నారు. రేవంత్ రెడ్డి తప్పులను ప్రజలు లెక్కిస్తున్నారని.. తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. అర్హులకు వెంటనే ఇండ్లు ఇవ్వాల్సిందేనన్నారు. రేషన్ కార్డులను ఎందుకు జారీ చేయడం లేదు ? మండిపడ్డారు. రుణ మాఫీ ఎక్కడా కూడా సంపూర్ణంగా కాలేదని.. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరారన్నారు. అయినా కూడా మనోధైర్యంతో కార్యకర్తలు చెక్కుచెదరలేదని.. ఉప ఎన్నిక వస్తే జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోతుందన్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ..

న్యూఢిల్లీ,ఫిబ్రవరి10: భారాస ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ మరోమారు వాయిదా పడింది. ఏడుగురు ఎమ్మెల్యేలపై దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవడంలో తెలంగాణ స్పీకర్ జాప్యం చేస్తున్నారంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కేటీఆర్ తన పిటిషన్‌లో తెలంగాణ స్పీకర్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, అరెకపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్‌లను ప్రతివాదులుగా చేర్చారు. జస్టిస్ గవాయ్ ధర్మాసనం ఇవాళ ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది.అసెంబ్లీ కార్యదర్శి తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. స్పీకర్ నుంచి సమాచారం కోసం మరింత సమయం కావాలని రోహత్గీ కోర్టును కోరారు. స్పీకర్‌తో చర్చించి వివరాలు అందిస్తామని తెలిపారు. ఇప్పటికే 10 నెలలు పూర్తయిందని.. ఇంకెంత గడువు కావాలని ధర్మాసనం ప్రశ్నించింది. ముకుల్ రోహత్గీ విజ్ఞప్తితో పిటిషన్‌పై తదుపరి విచారణను ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఈ పిటిషన్ పెట్టారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. పార్లమెంటరీ పక్రియను ప్రస్టేషన్‌కు గురి చేయొద్దని, ప్రజాస్వామ్యంలో పార్టీలకు హక్కులు ఉంటాయని తెలిపింది. ఎమ్మెల్యేలు పార్టీలు మారి 10 నెలలు అయింది.. ఇది రీజనబుల్ టైం కాదా అంటూ సుప్రీం కోర్ట్ ప్రశ్నించగా..మాకు వాదనలు వినిపించేందుకు రెండు మూడు రోజుల సమయం కావాలని రోహిత్గి కోరారు. మరోవైపు సుప్రీంకోర్టు ఇచ్చిన గత తీర్పుల ప్రకారం రీజనబుల్ టైమ్ అంటే మూడు నెలలు మాత్రమేనని బిఆర్ఎస్ వాదిస్తుంది. రీజనబుల్ టైమ్ అంటే ఎంత సమయం కావాలో చెప్పండని కోర్టు లేవనెత్తింది. అనంతరం ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు, ఈ పిటిషన్‌పై విచారణను ఫిబ్రవరి 18కి

వాయిదా వేసింది.పార్టీ మార్పులు ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించేలా ఉంటాయని కేటీఆర్ ఆరోపించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల చర్యలతో ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేసినట్లు కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ కేసు తదుపరి విచారణకు వేచి చూడాల్సి ఉంది. బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వెళ్లిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలని గులాబీ పార్టీ వరుస పిటిషన్లు దాఖలు చేసింది. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో పాటు వివేకానంద గౌడ దాఖలు చేసిన రెండు పిటిషన్లతో పాటు ఇటీవల తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఒక పిటిషన్ దాఖలు చేశారు. గతంలో పాడి కౌశిక్ రెడ్డి, వివేకా కలిసి పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్యేలపై పిటిషన్ వేయగా.. మరో ఏడుగురి పేర్లను జత చేసి కేటీఆర్ మరో పిటిషన్ దాఖలు చేశారు. ఆ రెండు పిటిషన్లను జత చేసి ఈరోజు సుప్రీం ధర్మాసనం విచారణ జరిపింది.ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించి దాదాపు 10 నెలలు అవుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని... వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా తెలంగాణ స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోర్టు ముందు వాదనలు వినిపించారు బీఆర్ఎస్ తరపు న్యాయవాది. అనంతరం కేసు విచారణను 18కి వాయిదా వేసింది ధర్మాసనం. ఈ క్రమంలో 18న జరగబోయే వాదనలపై ఉత్కంఠ నెలకొంది.

రంజాన్ కు ముందు బంగ్లాదేశ్ స్పెషల్ ఆపరేషన్...

ఢాకా, ఇస్లాంలో రంజాన్ మాసం చాలా ముఖ్యమైనదిగా చెబుతారు. ఈ నెలలో దెయ్యం కూడా జైలు పాలవుతుందని అంటున్నారు. మరోవైపు, బంగ్లాదేశ్‌లో ఈ నెలాఖరులో ప్రారంభమయ్యే రంజాన్ ముందు దెయ్యాల వేట ఆపరేషన్ ప్రారంభించబడింది.ఈ దయ్యాలు ఆకాశం నుండి వచ్చినవేమీ కాదు. బంగ్లాదేశ్ ప్రభుత్వం తన సొంత వ్యక్తులను దయ్యాలుగా పరిగణిస్తోంది. వారిని అరెస్టు చేయడానికి 'ఆపరేషన్ డెవిల్ హంట్' ప్రారంభించింది. శుక్రవారం రాత్రి గాజీపూర్‌లో విద్యార్థులు, సామాన్య ప్రజలపై దాడి తర్వాత బంగ్లాదేశ్‌లో ఈ ఆపరేషన్ ప్రారంభించబడింది. ఇప్పటివరకు ఈ ఆపరేషన్ ద్వారా బంగ్లాదేశ్ భద్రతా దళాలు 1,308 మందిని అరెస్టు చేశాయి. "అన్ని సాతాను శక్తులను" నిర్మూలించే వరకు అణచివేతను కొనసాగిస్తామని పరిపాలన ప్రతిజ్ఞ చేసిందని ప్రధాన మంత్రి ముహమ్మద్ యూనస్ అన్నారు.

ఆపరేషన్ డెవిల్ హంట్ అంటే ఏమిటి?

ఇటీవల బంగ్లాదేశ్‌లో ఢాకాలో బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రెహమాన్ ఇంటిపై దుండగులు దాడి చేసి ధ్వంసం చేశారు. ఈ అల్లర్లలో చాలా మంది విద్యార్థి కార్యకర్తలు గాయపడ్డారు. ఈ సంఘటన తర్వాతే మహమ్మద్ యూనస్ 'ఆపరేషన్ డెవిల్ హంట్' ప్రారంభించడానికి సూచనలు ఇచ్చాడు. దేశంలో శాంతిభద్రతలను నెలకొల్పడం ఈ ఆపరేషన్ ఉద్దేశ్యం. ఈ ఆపరేషన్ ద్వారా దేశ స్థిరత్వానికి ముప్పు కలిగించే వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నామని, దుష్టశక్తులన్నింటినీ పట్టుకునే వరకు ఇది కొనసాగుతుందని

లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) జహంగీర్ ఆలం చౌదరి అన్నారు.

దేశంలో బలగాల మోహరింపు

శనివారం సాయంత్రం చట్ట అమలు సంస్థలతో జరిగిన సమావేశంలో బంగ్లాదేశ్ హోం మంత్రిత్వ శాఖ ఈ ఆపరేషన్ ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ ఆపరేషన్‌లో పోలీసులు మాత్రమే కాకుండా బంగ్లాదేశ్ ఆర్మీ, నేవీ, వైమానిక దళం, బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్, అన్సార్, కోస్ట్ గార్డ్ సిబ్బంది కూడా పాల్గొంటారు. చట్టవిరుద్ధమైన తుపాకీలను స్వాధీనం చేసుకోవడానికి,శాంతిభద్రతలను కాపాడటానికి సాయుధ దళాలు,కోస్ట్ గార్డ్, పోలీసులు,రాపిడ్ యాక్షన్ బెటాలియన్, అన్సార్‌లతో సహా ఉమ్మడి దళాలు సెప్టెంబర్ 4 నుండి దేశవ్యాప్తంగా మోహరించబడ్డాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో చేతులు కలిపిన బీఆర్ఎస్,బీజేపీ

హైదరాబాద్,ఫిబ్రవరి10: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలు చేతులు కలిపాయని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఫాం హౌస్‌కే పరిమితమైన మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకని ప్రశ్నించారు. గజ్వేల్ ప్రజలను పట్టించుకోకుండా ఫాంహౌస్‌లో కేసీఆర్ సేద తీరుతున్నారని విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందని అన్నారు. సోమవారం గజ్వేల్ రిమ్మన్నగూడ ఎస్ -4 వద్ద టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించడానికి బీఆర్ఎస్- బీజేపీ లోపాయికారి ఒప్పందంతో ఎన్నికలకు వస్తున్నాయని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల మాదిరిగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరోక్షంగా బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి మద్దతిస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులు కరువు అయ్యారని అన్నారు. తెలంగాణలో బీజేపీకి 8 మంది ఎంపీలు ఉంటే బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చిన నిధులు గాడిద గుడ్డు అని ఆక్షేపించారు. ఇక్కడి బీజేపీ నేతలకు మతం పేరిట రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందండం ఆనవాయితీగా వస్తోందని ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో మొట్ట మొదటిగా తెలంగాణలో కులగణన సర్వే నిర్వహించడం జరిగిందని చెప్పుకొచ్చారు. కుల గణన సర్వేతో దేశానికి ఆదర్శంగా నిలిచామని ఉద్ఘాటించారు. పారదర్శకంగా కులగణన సర్వే నిర్వహించామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌లో కేటీఆర్ – కవిత – హరీష్ మధ్య మూడు ముక్కలాట నడుస్తోందని విమర్శలు చేశారు. బీసీల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. కులగణన సర్వేలో పాల్గొనని కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు రీ సర్వే జరపమని అడిగే అర్హత లేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 56 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు. నిరుద్యోగ నిర్మూలన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తోందన్నారు. మాటకు కట్టుబడి ఇచ్చిన హామీలను నెరవేర్చామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చొరవతో రికార్డు స్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

ఢిల్లీలో ఓటమికి ఆప్,కాంగ్రెస్‌లదే బాధ్యత

న్యూఢిల్లీ,ఫిబ్రవరి10: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘోర పరాజయాన్ని మూట కట్టుకుంది. 27 ఏళ్ల తర్వాత కాషాయ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇక సుదీర్ఘ అనుభవం కలిగిన కాంగ్రెస్ అయితే ఘోరంగా చతికిలపడింది. ముచ్చటగా మూడోసారి కాంగ్రెస్ జీరో సీట్లు సాధించింది. తాజాగా ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ స్పందించారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి ఆప్, కాంగ్రెస్ బాధ్యత వహించాలని సూచించారు. మనమంతా ఇండియా కూటమిలో భాగస్వాములం.. కాంగ్రెస్ సీనియర్ భాగస్వామి.. అందరినీ కలుపుకుని తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్‌కు ఉందని హితవు పలికారు. అలాగే ఆప్ కూడా బాధ్యత ఉందని చెప్పుకొచ్చారు. ఎన్నికల్లో కలిసి పోటీ చేసుంటే.. ఫలితాలు భిన్నంగా ఉండేవని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందే దీనిపై చర్చ జరగాల్సి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ఆప్–కాంగ్రెస్ కలిసి పోటీ చేసుంటే.. బీజేపీ గెలిచేది కాదు అన్నారు. ఇప్పుడు ఓటమికి ఆప్, కాంగ్రెస్ రెండూ కూడా బాధ్యత వహించాల్సిందేనని పేర్కొన్నారు. అయినా ఇండియా కూటమిలో ఎవరికీ అహం ఉండకూడదన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పెద్దన్న పాత్ర పోషించాలని సంజయ్ రౌత్ హితవు పలికారు. గత శనివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విడుదల య్యాయి. ఈ ఫలితాల్లో బీజేపీ అధికారం చేజిక్కించుకుంది. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠాన్ని కైవసం చేసుకుంది. ఇక ఆప్‌లో కేజీవ్రాల్, మనీష్ సిసోడియా లాంటి రాజకీయ ఉద్దండులంతా ఓడిపోయారు. మాజీ ముఖ్యమంత్రి అతిషి మాత్రమే కల్కాజీ నియోజకవర్గం నుంచి స్వల్ప మెజార్టీతో గట్టెక్కారు. లిక్కర్ స్కామ్, శేష్ మహల్ అంశం ఆప్‌ను ఘోరంగా దెబ్బకొట్టింది. ఢిల్లీలో మొత్తం 70 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. బీజేపీకి 48, ఆప్‌కి 22 సీట్లు వచ్చాయి.

బందీలకు హమాస్ చిత్రహింసలు...

వాషింగ్టన్,ఫిబ్రవరి10: హమాస్, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం అమలుచూస్తుంటే సహనం నశిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. బందీలను హోలోకాస్ట్ బాధితులతో పోల్చారు. హమాస్ విడుదల చేస్తున్న ఇజ్రాయెలీ బందీలను చూస్తుంటే మనసు చలించిపోతుందని అన్నారు. బందీలు నెలలతరబడి ఆహారం లేకుండా గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నట్లు కనిపిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇవన్నీ చూస్తూ తాము ఎంతకాలం సహనంతో ఉంటామో తెలియట్లేదని పేర్కొన్నారు. హమాస్‌లో 491 రోజులు బందీలుగా ఉండి తాజాగా విడుదలైన ముగ్గురు ఇజ్రాయెలీలు ఎల్ షరాబీ(52), ఒహద్ బెన్ అమి (56), ఓర్ లెవీలు పూర్తిగా బలహీనంగా కనిపించడంతో వారి కుటుంబ సభ్యులు, ప్రజలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. బందీలుగా మారకముందు, తరువాత వారికి సంబంధించిన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వాటిపై ట్రంప్ స్పందిస్తూ గాజాను స్వాధీనం చేసుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. తమ ఆధ్వర్యంలో దానిని పునర్ నిర్మించే బాధ్యత ఇతరులకు అప్పగిస్తామన్నారు. అయితే అంతిమంగా గాజాను తాము స్వాధీనం చేసుకోవాలనుకుంటు న్నామన్నారు. హమాస్ తిరిగి బలపడకుండా చూసుకోవాల్సిన బాధ్యత యూఎస్‌పైనే ఉందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయం లేదు కనుకే పాలస్తీనియన్లు శిథిలమైన గాజాలోకి రావాలనుకుంటున్నారని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే దీని కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటారనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. బందీల పరిస్థితిపై తాజాగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పందిస్తూ.. వారి బలహీనమైన, చిక్కిపోయిన శరీరాలను చూసి తాను దిగ్భాం÷-రతికి గురయ్యానని అన్నారు. వారి పరిస్థితి తనను ఎంతగానో కలచివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. గాజా కాల్పుల విరమణ అనంతరం ఇజ్రాయెల్–హమాస్‌ల మధ్య బందీల మార్పిడి కొనసాగుతోంది. ఒప్పందం తొలిదశలో భాగంగా హమాస్ 33 మంది బందీలను, ఇజ్రాయెల్

దాదాపు 1,800కు పైగా పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టనుంది.గాజాను స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై జర్మన్ ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ మండిపడ్డారు. గాజాను పూర్తిగా ఖాళీ చేయించి.. దానిని 'రివేరా ఆఫ్ మిడిల్ ఈస్ట్'గా మార్చాలని ట్రంప్ కుట్ర పన్నుతున్నారని అన్నారు. ఒక ప్రాంతంలోని ప్రజలను ఇతర ప్రాంతాలకు వెళ్లిపోమని శాసించడం సరైన చర్య కాదని..అంతర్జాతీయ చట్టాలకు అది విరుద్ధమన్నారు. ఇదంతా ట్రంప్ ఎలా చేయబోతున్నారో వేచి చూస్తామని పేర్కొన్నారు.

నమ్మించి యువతిపై లైంగిక దాడి చేసిన ఆటోడ్రైవర్

హైదరాబాద్,పెండ్లికి సాయం చేస్తానని నమ్మించి యువతిపై ఓ డ్రైవర్ లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకోగా.. ఆలస్యంగా విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకివెళితే.. జూబ్లిహిల్స్‌లోని ఓ బంగ్లాలో వాచ్‌మెన్ అతని కూతురు (19) ఉంటున్నారు. ఈ క్రమంలోనే అదే బంగ్లాలో డ్రైవర్‌గా పనిచేస్తున్న శివ నరసింహ అనే వ్యక్తి వాచ్ మెన్ కూతురి పెండ్లికి సాయం చేస్తానని నమ్మించాడు.

కుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించిన రాష్ట్రపతి

ప్రయాగ్‌రాజ్:ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. త్రివేణి సంగమం దగ్గర పవిత్ర స్నానం ఆచరించారు. అనంతరం ప్రార్థనలు చేశారు.అంతకముందు ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి యూపీకి చేరుకున్నారు. అక్కడ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్, గవర్నర్ ఆనందిబెన్ పటేల్ స్వాగతం పలికారు. అక్కడ నుంచి ప్రత్యేక వాహనంలో ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుని రాష్ట్రపతి పుణ్య స్నానం ఆచరించారు. అలాగే ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి కూడా త్రివేణి సంగమం దగ్గర పవిత్ర స్నానం చేశారు.మహా కుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. ఇప్పటికే కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి పుణ్యస్నానాలు చేస్తున్నారు. ఇప్పటికే

ఆయా దేశాల దౌత్యవేత్తలు వచ్చి పుణ్యస్నానాలు చేసి వెళ్లారు.

సంపాదకీయం

మంగళవారం 11-02-2025

జీతాలు పెంచమని అడగొకు !

ఉద్యోగులు, కార్మికులు వారానికి 70 గంటలు పని చెయ్యాలని గత ఏడాది ఇన్ఫోసిస్ అధిపతి నారాయణ మూర్తి ఒక ప్రతిపాదన చేశారు. తాడిని తన్నే వాడుంటే వాడి తలను తన్నేవాడుంటాడు అంటారు కదా. అలానే ఇప్పుడు ఉద్యోగులు, కార్మికులు వారానికి 90 గంటలు పని చెయ్యాలని ఎల్ అండ్ టి కంపెనీ చైర్మన్ పిలుపునిచ్చారు. ఆర్థికాభివృద్ధి సాధించి ప్రపంచంలోనే మన దేశం అగ్రగామిగా నిలవాలంటే ఆదివారాలు కూడా పనిచెయ్యాలని మరీ సెలవిచ్చారు. ప్రపంచంలోనే ఆర్థిక అసమానతలు అతి తీవ్రంగా ఉన్న దేశాల సరసన మనమూ ఉన్నాం. అయినా పెట్టుబడిదారులు మాత్రం కార్మికులు, ఉద్యోగులు ఎక్కువెక్కువ గంటలు పని చెయ్యాలని డిమాండ్ చేస్తున్నారే తప్ప జీతాల పెంపుదల గురించి మాత్రం మౌనం వహిస్తున్నారు. అదనపు విలువలో కార్మికుల వాటా గత మూడు దశాబ్దాలుగా వేగంగా పడిపోతూ వస్తున్నది. కార్మికుల నిజ వేతనాలు స్తంభించిపోయాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో సరిచూస్తే కొన్ని సందర్భాలలో ఈ నిజ వేతనాలు తగ్గు ముఖం పట్టాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2022-23 సంవత్సరంలో ఈ తరుగుదల పెరిగింది. ఇదే కాలంలో పెట్టుబడిదారులు ఆర్జించిన లాభాలు స్థూల జాతీయోత్పత్తితో పోలిస్తే ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. శత కోటీశ్వరుల సంఖ్య పెరిగింది. వీరి జీవనశైలి అగ్రగామి ధనిక దేశాల శత కోటీశ్వరుల జీవనశైలి స్థాయికి చేరుకున్నది. అంటే పెట్టుబడిదారులు ఈ స్థాయిలో సంపద పోగేసుకోవడానికి ప్రజలు, ముఖ్యంగా కార్మికులు, కష్టజీవులు త్యాగాలు చేసి పేదరికంలోకి దిగజారిపోవాలన్నమాట.ఏ సమాజంలో అయినా అదనపు విలువ సృష్టించేది శ్రామికులే. కానీ ఉత్పత్తి క్రమంలో కార్మికులు పడే కష్టంలో వెయ్యవ వంతు శ్రమ కూడా చెయ్యని వాళ్లు ఈ అదనపు విలువలో సింహ భాగాన్ని మింగేస్తున్నారు. ఈ అవకాశాన్ని దక్కించుకోవడానికి వాళ్లకి ఏవో అపారమైన తెలివితేటలు ఉన్నాయనుకోవడానికి లేదు. పోనీ ఏమన్నా 'రిస్క్' తీసుకుంటున్నారా అనుకోవడానికి%౦% అలాంటి రిస్క్ పర్యవసానాలను సామాజికం చేసే ఆర్థిక వ్యవస్థ ఉండనే ఉన్నది. మరయితే వాళ్లకి ఆ శక్తి ఎక్కడ నుండి వచ్చింది అంటే ఉత్పత్తి సాధనాల మీద వాళ్లకి ఉన్న హక్కుతోనే ఇది సాధ్యపడుతున్నది.ఉత్పత్తి సాధనాల నుండి కార్మికులు పరాయీకరించ బడుతున్నారు. కష్టం అంతా వాళ్లే చెయ్యాలి. కానీ ఫలితం మాత్రం వాళ్లకి దక్కదు. అయినాగానీ పెట్టుబడిదారులు మరిన్ని లాభాలు ఆర్జించడానికి కార్మికులు రెక్కలు ముక్కలు చేసుకుని మరీ మరింత కష్టం చెయ్యాలని కోరుకుంటున్నారు. నిజంగానే ఎక్కువ శ్రమించాల్సిన అవసరం, పని ఉంటే మన దేశంలో నిరుద్యోగులకు కొదవా? వాళ్లలో కొంతమందికైనా ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించవచ్చుగా. కానీ యజమానులు, పెట్టుబడిదారులు ఆ పని మాత్రం చెయ్యరు. ఎక్కువమందిని పనిలో పెట్టుకుంటే జీతాల వ్యయం పెరిగి వాళ్ల లాభాలు తగ్గుతాయి. పైపెచ్చు కార్మికుల సంఖ్య పెరిగిన కొద్దీ వాళ్లు సంఘటితపడి యూనియన్‌లు పెట్టుకుని తమ బేరసారాల శక్తిని పెంచుకునే ప్రమాదం ఉంటుంది. అందుకే వాళ్లు ఉన్న ఉద్యోగులు, కార్మికుల నుండే మరింతగా శ్రమ పిండుకోవాలని చూస్తారు. దాని కోసం పని గంటలు ఎక్కువ చెయ్యాలని చూస్తారు తప్ప దేశాభివృద్ధి, ఆర్థిక ప్రగతి, ప్రపంచంలో అగ్రగామిగా నిలబెట్టడం వంటి మాటలు అన్నీ మెరమెచ్చుల కోసమే. నిజంగానే వాళ్లు మన దేశం ప్రగతి సాధించాలని కోరుకునే వాళ్ళయితే మరింత మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించి తమ నిజాయితీ నిరూపించుకోవాలి.

కార్మికులపై అధిక పని గంటల భారం

కార్పొరేట్ అధినేతలు కాస్త కళ్ళు తెరచి వాస్తవాలు ఏమిటో గ్రహించాలి. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.యల్.ఓ) వెలువరించిన 2024 గణాంక నివేదికలను బట్టి చూస్తే మన దేశంలో కార్మికులు వారానికి సగటున 46.74 గంటలు పని చేస్తూ మొత్తం 170 దేశాలలో అత్యధిక గంటలు శ్రమ చేసే కార్మికులుగా 17వ స్థానంలో ఉన్నారు. మన తర్వాత స్థానంలో ఉన్న దేశాలు బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లు. అత్యధిక పని గంటలు ఉన్నది భూటాన్ దేశంలో (వారానికి 54.44 గంటలు). ఆ తర్వాతి స్థానంలో ఉన్నది యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (వారానికి 50.93 గంటలు). చైనా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్, మలేషియా, వియత్నాం, శ్రీలంక, క్యూబా, థారులాండ్, కొరియా వంటి అభివృద్ధి చెంతున్న దేశాలలో కార్మికులు భారతీయ కార్మికుల కన్నా తక్కువ గంటలు పనిచేస్తూ ఉన్నారు. అదే కెనడాలలో 32.24 గంటలు, నెదర్లాండ్స్‌లో 31.55 గంటలు, జర్మనీలో 34.24 గంటలు, బ్రిటన్‌లో 35.85 గంటలు ఫ్రాన్స్‌లో 35.9 గంటలు, అమెరికాలో 37.96 గంటలు పని చేస్తున్నారు. వారానికి 49 గంటలు అంతకు మించి పని చేస్తున్న కార్మికుల శాతం మొత్తం కార్మిక వర్గ సంఖ్య తేల్చి చూస్తే అత్యధికంగా ఉన్న మొత్తం 170 దేశాలలో మన దేశం రెండవ స్థానంలో ఉన్నది. 49 గంటలు అంతకు మించి పని చేస్తున్న కార్మికుల శాతం భూటాన్‌లో 61.3 శాతంగా ఉన్నది. రెండవ స్థానంలో ఉన్న మన దేశంలో ఇది 51.4 శాతంగా ఉన్నది. కాబట్టి ప్రపంచంలోనే 49 గంటలకు మించి శ్రమ చేసే కార్మికులు అత్యధికంగా మన దేశంలో ఉన్నందుకు%౦%అదుపు లేకుండా వారి శ్రమను ఈ రకంగా దోచుకునేందుకు అవకాశం దక్కినందుకు కార్పొరేట్ యజమానులు, పెట్టుబడిదారులు పండుగ చేస్కోవాలి.కార్మికులు, ఉద్యోగులతో ఎక్కువ పని చేయించుకుని తక్కువ వేతనాలు ఇవ్వడంలో భారతీయ పెట్టుబడిదారులు అంతర్జాతీయంగా పోటీ ఇచ్చే స్థాయిలో ఉన్నారు. ఉత్పత్తి ఖర్చులు తగ్గించుకోవడానికి అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడానికి బదులు కార్మికుల మీద చేసే వ్యయాన్ని తెగ్గోసే దగ్గరి మార్గాన్ని ఎంచుకున్నారు. పెట్టుబడిదారీ విధానం తొలి దశలో పెట్టుబడిదారీ వర్గం ఎంచుకున్న మార్గం ఇది. అదనపు విలువ పోగేసుకోవడానికి కార్మికులతో ఎక్కువ గంటలు పని చేయించుకునేవారు. ఈ శ్రమ దోపిడికి వ్యతిరేకంగా పంతొమ్మిదవ శతాబ్దం అంతా యూరప్, అమెరికా దేశాల్లో కార్మికవర్గం సమరశీల ప్రతిఘటనా పోరాటాలు నిర్వహించింది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా రోజుకి 8 గంటల పని దినం అమలులోకి వచ్చింది. దీనితో పెట్టుబడిదారులు నికర అదనపు విలువకు బదులు సాపేక్ష అదనపు విలువ గడించడం మీద దృష్టి పెట్టారు. అంటే కార్మికుల జీతభత్యాలు పెంచకుండా వారి ఉత్పాదక శక్తిని పెంచే మార్గాన్ని ఎంచుకున్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కార్మికుల ఉత్పాదకత రెట్టింపు అయ్యేలా చూశారు. జీతాలు, పని గంటలు పెంచకుండా కార్మికుల నుండి అదనపు ఉత్పత్తిని దోచుకోవడం మొదలు పెట్టారు.

సాంకేతిక పరిజ్ఞానం-అదనపు పని గంటలు

అభివృద్ధి చెందిన దేశాల్లో కార్మికులతో ఎక్కువ గంటలు పని చేయించే పరిస్థితి లేకపోవడంతో పెట్టుబడిదారీ వర్గం నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆశ్రయించింది. భారత్ సహా వర్ధమాన దేశాలన్నింటా కార్మిక హక్కులను పరిరక్షించేందుకు ఉద్దేశించిన సంస్థాగత రక్షణలు బలహీనంగా ఉండడం, అవి కూడా మెజారిటీ కార్మిక వర్గానికి వర్తించే పరిస్థితి లేకపోవడంతో ఉమ్మడి బేరసారాల శక్తి బలహీనంగా ఉండడం మూలంగా కార్మిక వర్గానికి తక్కువ వేతనాలు ఇచ్చి ఎక్కువ గంటలు పని చేయించుకునే వెసులుబాటు పెట్టుబడిదారులకు దక్కింది.

కేజ్రీవాల్ పతనం ఓ గుణపాఠం

న్యూఢిల్లీ,రాజకీయాల్లో అవినీతిని ఊడ్చేస్తానంటూ ప్రగల్భాలు పలికి ..రాజకీయంగా అందలం ఎక్కి..అవినీతిని కేరాఫ్ అడ్రస్‌గా మార్చుకున్న ఆప్ పార్టీని ఢిల్లీ ప్రజలే ఊడ్చి పడేశారు. అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన కేజ్రీవాల్ కేవలం ప్రధాని పీఠంపై కన్నేసి ఎప్పుడైతే రాజకీయాలు మొదలు పెట్టారో అప్పుడే ఆయన పతనం ప్రారంభం అయ్యిందని చెప్పాలి. అవినీతి వ్యతిరేక రాజకీయాలు కొనసాగించివుంటు కేజ్రీవాల్ రాజకీయాల్లో వజ్రంలా నిలిచేవారు. దేశ ప్రధాని పదవి కోరుకోకుండానే వచ్చేది. రాజకీయాలకు చుక్కానిగా ఉండేవారు. కానీ ఆయన ఢిల్లీలో పాగా వేయడంతోనే ఇక తనకు ఎదురులేదన్న రీతిలో అవినీతి పంకిలంలో కూరుకు పోయారు. ఆయన మంత్రులు, అనుచరులు, ఎమ్మెల్యేలు అంతా అందులో దిగబడ్డారు. యధారాజా తథా ప్రజా..అన్న సామెతలాగా ఆయనలాగే ఆయన అనుచరగణం రాజకీయాలు నడిపింది. అవినీతి అన్నది అగ్నికణం లాంటిది. దానిని పట్టుకుని సాగాలంటే ధైర్యం కావాలి. కానీ కేజ్రీవాల్ అలాంటి ప్రయత్నాలు చేయలేదు. అందుకే పదేళ్లుగా అందలమెక్కించిన ఢిల్లీ ప్రజలు విసుగుచెంది ఊడ్చేశారు. అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమంలో చేరిన కేజ్రీవాల్ ఓటమిని ఇప్పుడు హజారేనే అభినందించే పరిస్థితి వచ్చింది. అవినీతికి దూరంగా ఉండాలని ఆయన పదేపదే హెచ్చరించినా కేజ్రీవాల్ పెడచెవిన పెట్టారు. అవినీతి వ్యతిరేక రాజకీయాలకు తానొక బ్రాండ్ అని ప్రచారం చేసుకున్న కేజ్రీవాల్ దానికి కట్టుబడి ఉండలేదు. అనేక అవినీతి కేసుల్లో తానూ, తన అనుయాయులు ఇక్కుకుని విలవిల్లాడుతూ..కేవలంమోడీని చూపి రాజకీయం చేశారు. అరవింద్ కేజ్రీవాల్..అవినీతి మరకలతో ఇప్పుడు మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకుని పట్టతప్పారు. అవినీతి చుట్టూ కేజ్రీవాల్ అల్లుకు పోయారని తెలుసుకున్న ప్రజలు ఇప్పుడు ఊడ్చేశారు. అవినీతికి వ్యతిరేకంగా జన లోక్‌పాల్ బిల్లుకోసం అన్నాహజారే నేతృత్వంలో జరిగిన ఉద్యమమే ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావానికి దారితీసింది. ఢిల్లీ వీధుల్లో ఒకప్పుడు సంచలనంగా మారిన ఆప్ ఇప్పుడు అడ్రస్ గల్లంతయ్యిందనే చెప్పాలి. ఈ ఎన్నికల్లో బిజెపి బాగా కష్టపడి పనిచేసిందనే కన్నా, ఆప్ తన సైద్ధాంతికత నుంచి తప్పుకోవడమే ఓటమికి కారనమని చెప్పుకోవాలి. ప్రజలకు ఉచిత బస్సు, ఉచిత కరెంట్, ఉచిత విద్య లాంటి నినాదాలతో మార్మోగించిన కేజ్రీవాల్ అసలు సమస్యలు పక్కన పెట్టారు. ఢిల్లీ వాతావరణ కాలుష్యంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మంచినీటి సరఫరాకు కారణమైన యమునా నది కాలుష్యం గురించి మాట్లాడలేదు. మోడీని, బిజెపిని విమర్శించడమే రాజకీయంగా ముందుకు సాగారు. అందుకే పదేళ్లుగా అధికారంలో ఉన్నా..లాభం లేకుండా పోయిందని ప్రజలు ఆలోచించారు. చివరకు కేజ్రీవాల్‌ను కూడా ఓడించేలా చేశారు. సిఎం అతిశీని కూడా ఓడించారు. రాజకీయాల్లో హీరియిజం ఉండాలి. శత్రువును ఎదుర్కొనే ధైర్యం ప్రదర్శించాలి. కానీ అలాంటివేవీ కేజ్రీవాల్ చేయలేదు. రాజకీయాల్లో అవినీతి అంతం ఆవాలంటే ఆప్ రావాలన్న పార్టీగా గుర్తింపు తెచ్చుకున్న ఆప్ అనతి కాలంలోనే అవినీతి పార్టీగా ముద్ర వేసుకుంది. ఈ క్రమంలో ఢిల్లీలో ఓటమి అన్నది కేజ్రీవాల్ స్వయంకృతం. నిజాయితీగా ఢిల్లీలో పాలన చేసివుంటే ఆయన ప్రతిభ ఇనుమడించేది. ప్రజలు ఆదరించేవారు. కానీ అది వదిలిపెట్టి దేశమంతా తిరిగి, తానే ప్రధాని కావాలన్న దురాలోచనలో రాజకీయాలు చేసి చతికిలపడ్డ తీరు..భారత రాజకీయాల్లో ఓ గుణపాఠం లాంటివి. అవినీతిపై పోరాటంలో కాంగ్రెస్‌పై యుద్ధం ప్రకటించిన కేజ్రీవాల్..అనతి కాలంలోనే దేశ ప్రజల మనసులు గెల్చుకున్నారు. ప్రజలు రాజకీయ నాయకుల అవినీతి పట్ల ఎంత అసహ్యంగా ఉన్నారనడానికి కేజ్రీవాల్ ఎదుగుదలే కారణం. కానీ అనతి కాలంలోనే కేజ్రీవాల్ నిజస్వరూపం బయటపడింది. ఆయన ముసుగు తొలగింది. అవినీతికి కేంద్రంగా కేజ్రీవాల్ రాజకీయాలు నడిచాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఇందుకు పరాకాష్ట. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో కలసి అవినీతి స్కామ్‌లో ఇరుక్కోవడం ఆయన పతనానికి నాంది పలికింది. అలాగే తన ఇంటిని వందల కోట్లతో అద్భుతంగా శీష్‌మహల్‌గా మార్చుకున్న తీరు ఆయన ప్రతిష్టను దిగజార్చింది. కాంగ్రెస్ అవినీతిని వ్యతిరేకించిన కేజ్రీవాల్... కాంగ్రెస్ పంచనే చేరారు. ఇవన్నీ గమనిస్తూ వచ్చిన ప్రజలు రాజకీయాల్లో అబద్దాలుచెప్పే వ్యక్తిగా గుర్తించారు. అబద్దాలుచెప్పేవారిని ప్రజలు పెద్దగా పట్టించుకోరు. కానీ నిజాయితీగా ఉంటానంటూ అబద్దాలుచెబితే మాత్రం సహించరు. నిప్పులేనిదే పొగరాదన్నట్లు ...కేంద్రం ఎంతగా కక్షకట్టి కేసులు పెట్టినా.. అవినీతి లేనిదే కేసులు చుట్టుకోవు. మోడీని నిందించినంత మాత్రాన తన అవినీతిని కప్పిపుచ్చు కోలేరు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి కూడా గుణపాఠం లాంటివే. తన రాజకీయ ధోరణిని కాంగ్రెస్ మార్చుకోవాల్సి ఉంది. కుటుంబ రాజకీయాలు చేసినా, ప్రజాస్వామ్య బద్దంగా నడుచుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో కేజ్రీవాల్ ఎంతగా ఇప్పుడు అరిచి గీపెట్టినా ప్రజలు ఇకముందు నమ్ముతారని అనుకోవడానికి లేదు. గెలుపు కోసం అవినీతి వ్యతిరేక పోరాటాన్ని పక్కన పెట్టిన కేజ్రీవాల్, ఉచిత పథకాలతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నంలో రాజకీయాలు మొదలు పెట్టారు. అవినీతి వ్యతిరేక రాజకీయాలు పక్కన పోయాయి. కేవలం తన స్వార్థ రాజకీయాలతో దేశ ప్రధాని కావడమే లక్ష్యమన్న రీతిలో ముందుకు సాగారు. పరమపద సోపాన పటంలో పెద్దపాము మింగితే పడ్డట్లుగా కిందపడ్డారు. ఇప్పుడు ఆయన అవినీతి వ్యతిరేక మాటలు చెబితే ఇక ప్రజలు నమ్మరు. ఏం చెబితే , ఏం చేస్తే రాకీయంగా ఎదుగగలమో కొత్తగా ఆలోచించాలి. అవినీతికి సంబంధించి మాట్లాడితే ప్రజలు ఛీత్కరించే పరిస్థితి వచ్చింది. దీంతో ఇప్పుడు కేజ్రీవాల్ పతనం కూడా ఓ రాజకీయ గుణపాఠంగా చూడాలి.

కేంద్ర బడ్జెట్‌తో గిరిజనులకు ఒరిగేదేమిటి?

న్యూఢిల్లీ,బడ్జెట్‌కి ముందు వెలువరించే ఆర్థిక సర్వే ప్రకారంగా వివిధ తరగతులకు లబ్ధి జరిగేలా బడ్జెట్ రూపొందించవలసిన అవసరం ఉంది. ఆదివాసీ విద్య, వైద్యం విషయమై నిర్లక్ష్యం జరిగిందని ఆర్థిక సర్వే తెలిపింది. దీనికి అనుగుణంగా కాకుండా వివిధ వర్గాలకు అన్యాయం చేసేలా ముఖ్యంగా ఆదివాసులపై మరింత దోపిడీ పెంచేవిధంగా, ఆదివాసీ ప్రాంత వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గిరిజనుల అభివృద్ధికి నిధులు కోత పెట్టారు.రూ. 50,65,345 కోట్ల బడ్జెట్‌లో జనాభా నిష్పత్తి ప్రకారం గిరిజనులకు ఏమాత్రం కేటాయింపులు జరిగాయో చూద్దాం. దేశ గిరిజన జనాభా సుమారు 8.8 కోట్లు. జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయింపులు 8.6 శాతం అంటే రూ. 5,88,993 కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం ఈ ఏడాది రూ. 1,29,249 కోట్లు మాత్రమే కేటాయించి గిరిజనులకు తీరని అన్యాయం చేశారు. ఇందులోనే గిరిజన వ్యవహారాల శాఖకు ఈ ఏడాది కేవలం రూ. 14,925 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారు. గిరిజనుల అభివృద్ధికి నేరుగా ఉపయోగపడే రంగాల్లో కేటాయింపులు పూర్తిగా తగ్గించి కార్పొరేట్లు, బడా కాంట్రాక్టర్లు, ధనవంతులకు లబ్ధి చేకూర్చే రంగాల్లో మాత్రం గణనీయమైన కేటాయింపులు చేశారు.ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు గతేడాది రూ. 440 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ. 313 కోట్లు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు గతేడాది రూ. 2432 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ. 30 కోట్లు మాత్రమే అదనంగా పెంచి చూపించారు. దేశంలో గణనీయంగా పెరుగుతున్న గిరిజన విద్యార్థుల సంఖ్యతో పోల్చుకుంటే ఇవి ఏ మాత్రం సరిపోదు.రాజ్యాంగబద్ధంగా 275(1) అధికరణ ద్వారా షెడ్యూల్డ్ ప్రాంత గిరిజనుల అభివృద్ధికి గ్రాంట్‌గా ఇవ్వాల్సిన నిధులను సైతం పెంచకపోవడం దుర్మార్గం. దీనికి గతేడాది రూ. 1541 కోట్లు కేటాయించగా ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా అదనంగా కేటాయించలేదు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో భాగంగా తెలంగాణ, ఆంధ్రలో గిరిజన యూనివర్సిటీలు మంజూరు చేసి పదేళ్లు దాటినా అతీగతీ లేదు. ఈ బడ్జెట్‌లో ఆంధ్ర, తెలంగాణ యూనివర్సిటీలకు కలిపి ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా గిరిజనులను కేంద్రం మోసం చేసింది. రాజ్యాంగం ప్రకారం గిరిజనులకు హక్కుగా కేటాయింపులు చేయాల్సిన గిరిజన సబ్‌ప్లాన్‌ను సైతం రద్దు చేసింది.ఆదివాసీలకు ఉపాధి వంటి రంగాల్లో కీలకమైన స్కిల్ డెవలప్‌మెంట్‌కు నిధులను అధికంగా కేటాయించకపోవడం బాధాకరం. ఆదివాసీ నిరుద్యోగులు ఉద్యోగావకాశాలు పొందేలా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. చేసిన కొద్దిపాటి కేటాయింపు సైతం దేటా సెంటర్లకు లాభాలు కల్గించేలా ఉంది. ఈ రంగానికి బడ్జెట్‌లో రూ. 317 కోట్ల నిధులు కేటాయించారు. గత ఏడాది రూ. 470 కోట్లు కేటాయించారు. అంటే పోయిన సంవత్సరం కేటాయించిన బడ్జెట్‌లో కోత విధించారన్నమాట.గిరిజనుల్లో పారిశ్రామిక వ్యాపార అవకాశాలు పొందే విధంగా కేటాయింపులు లేవు. గతేడాది చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించి బడ్జెట్ కేటాయింపులు చూసినప్పుడు గతేడాది రూ. 10,881 కోట్లు ఈ ఏడాది రూ. 2116 కోట్లు నిధులు మాత్రమే కేటాయించారు. ఆ నిధుల కేటాయింపు కూడా కార్పొరేట్ సంస్థల ఖాతాలో స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో పోతుంది.గిరిజన శాఖల నిధులను ప్రభుత్వం దారి మళ్లిస్తున్నది. ఉదాహరణకు గత ఏడాది రూ. 16,300 కోట్లు నిధులను హైవే రోడ్లకు కేటాయించారు. ఇదిలా వుండగా ఆదివాసుల గ్రామాల్లో రోడ్లు, మౌలిక వసతులు లేని కారణంగా రోజూ డోలీ మోతలే కనిపిస్తాయి. పైగా కేటాయించిన నిధులను కూడా ఖర్చు చెయ్యడం లేదు.బడ్జెట్ కేటాయింపులలో ఆదివాసీలకు ఉపాధి భరోసా ఇవ్వలేదు. బడ్జెట్ కేటాయింపులో కేవలం రూ. 2 వేల కోట్ల నిధులు చూపించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో నియామకాలు లేవు. బ్యాక్‌లాగ్ పోస్టుల ఉసే లేదు. వలసల నివారణకు చర్యలు లేవు. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలపై ఎటువంటి నిధులూ కేటాయించలేదు. 2021-22 కేంద్ర బడ్జెట్‌లో రూ. 155 కోట్ల నిధులు కేటాయించిన తర్వాత ఇప్పటి వరకూ రూపాయి కేటాయించలేదు.గత ఏడాది ఆర్టికల్ 275(1) ప్రకారం రూ. 1541 కోట్లు కేటాయించగా ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులు లేవు. ఈ నిధులు ఎక్కువగా ఆదివాసీ ప్రాంతంలో సంక్షేమం కోసం ఖర్చు చేస్తుంది. ఐటిడిఎలో ఈ నిధులతోనే గతంలో సంక్షేమ పథకాలకు కొంత సహాయం అందేది. ఇప్పుడు నిధులు లేక ఐటిడిఏలు ఉత్సవ విగ్రహాలుగా తయారయ్యాయి.ప్రధాన మంత్రి జన్మభూమి యోజన (పి.ఎమ్ జన్మన్) లక్ష్యం ప్రాథమిక సదుపాయాల కల్పన, ఆరోగ్యం, విద్య, ఆవాసాల నిర్మాణం, పోషకాహారం అందించడం. దేశంలో 75 రకాల ఆదిమజాతి పివిటిజి వెనుకబడిన ఆదివాసీ గిరిజన తెగల వారు జీవిస్తున్నారు. బడ్జెట్ కేటాయింపులు వారి జీవన ప్రమాణాలు పెంచేవిధంగా లేవు. ఆదివాసులకు ఇళ్ల నిర్మాణానికి, మౌలిక వసతులు, విద్య, వైద్యం, పౌష్టికాహారం కల్పించేందుకు పివిటిజి పథకాన్ని 2023 అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీ బల్లుగూడలో ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రతిష్టాత్మకంగా ఈ పథకానికి ఐదేళ్లపాటు ఖర్చు చెయ్యడానికి రూ. 24 వేల కోట్లు కేటాయిస్తునట్లు ప్రచారం చేశారు. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 6 వేల కోట్లు కేటాయించారు. జన్మన్ యోజన పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి ఈ నిధులు చాలడంలేదు. ఇళ్ల నిర్మాణానికి కనీసం రూ. 5 లక్షలు నిధులు కేటాయించాలి.అటవీ ఉత్పత్తుల గిట్టుబాటు ధరల కోసం 2021, 2022లో రూ. 155 కోట్ల నిధులు విడుదల చేశారు. ఆ తర్వాత నిధులు కేటాయింపు లేవు. దేశంలో కోట్లాది మంది ఆదివాసీ ప్రజలు ఆధారపడి జీవిస్తున్న అటవీ ఉత్పత్తుల గిట్టుబాటు ధరల ఊసే లేదు. షెడ్యూల్ ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి భారీ ఎత్తున ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు సుమారు రూ. 20 వేల కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రకటించింది. కానీ వాస్తవానికి సహజ వనరులను, అడవిని, భూమిని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకే ఈ ఎత్తుగడ. దీనికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సభాపతి 1/70 చట్టాన్ని సవరించాలని ప్రకటించారు.ఆదివాసీలకు అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్‌పై నిరసన కార్యక్రమాలు చేపట్టాలి. ప్రభుత్వంపై ఒత్తిడి చేసి బడ్జెట్ కేటాయింపులు పెంచుకోవాలి.

రవాణాశాఖ కార్యాలయ ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టి

హైదరాబాద్, వరంగల్ రవాణా శాఖ కార్యాలయ ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. డీటీసీ శ్రీనివాస్ ఇళ్లల్లో ఏసీబీ దాడులు, అరెస్టు తర్వాత మరో అధికారిపై చర్యలు తీసుకుంది. తాజాగా వరంగల్ డీటీఓ లక్ష్మిపై బదిలీ వేటు వేసింది. హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించింది. ఎంవీఐ శోభన్ బాబును వరంగల్ ఇంచార్జ్ డీటీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ (డీటీసీ) పుప్పాల శ్రీనివాస్ ఇళ్లల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించి ఆదాయానికి మించి ఆస్తులున్నాయని గుర్తించి అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

ఆప్ ఓటమి స్వయంకృతమన్న ఆమ్ ఆద్మీ

ముంబయి, ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై అన్నా హజారే స్పందించారు. అధికార దాహంతోనే మాజీ ముఖ్యమంత్రి కేజీవ్రాల్ హారే ఓడిపోయారని ధ్వజమెత్తారు. కేజీవ్రాల్‌పై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయన్నారు. లిక్కర్ స్కామ్‌తో కేజీవ్రాల్ అప్రతిష్టపాలయ్యారని, అందుకే ఆప్ ను ప్రజలు ఓడించారరని దుయ్యబట్టారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి దూసుకుపోతోంది. ఇప్పటివరకు జరిగిన ఓట్ల లెక్కింపులో బిజెపి మ్యాజిక్ ఫిగర్ 36 దాటింది. ప్రస్తుతం బిజెపి 46స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతుండగా అధికార పార్టీ ఆప్ 24 సీట్లలో ముందంజలో ఉంది. కేజీవ్రాల్‌తో పాటు సిఎం అతిషి కూడా ఓటమి చెందారు. ఈ క్రమంలో సామాజిక కార్యకర్త అన్నా హజారే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమిపై స్పందించారు. ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తికి మంచి క్యారెక్టర్ ఉండాలని, మంచి ఆలోచనపరులనే ప్రజలు ఎన్నుకుంటారంటూ మాజీ సీఎం అరవింద్ కేజీవ్రాల్ పార్టీ ఓటమిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఎప్పటినుంచో ఎన్నికల విషయంపై కేజీవ్రాల్ ను హెచ్చరించినా, వాటిని పెడచెవిన పెట్టారని.. దాని ఫలితమే ఇదన్నారు అన్నా హజారే. ఎన్నికల్లో పోటీ చేయడంపై పలుమార్లు హెచ్చరించాను. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థికి మంచి వ్యక్తిత్వంతో పాటు, మంచి ఆలోచనలు ఉండాలని నేను భావిస్తాను. వ్యక్తికి సంబంధించిన క్లీన్ ఇమేజ్ ఉండాలి. లేకపోతే ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఆప్ నేతలు అవినీతి ఆరోపణల్లో చిక్కుకుని జైలుకు వెళ్లారు. ఇలాంటివి ఉండకూడదని చాలా కాలం నుంచి చెబుతున్నాను. ఆప్ నేతలు లిక్కర్ స్కామ్, అనివీతి ఆరోపణలలో చిక్కుకున్నారు. వాటి ఫలితంగా అరవింద్ కేజీవ్రాల్ ఇమేజ్ దెబ్బతింది. అందువల్లే ఆప్ నేతలకు, కేజీవ్రాల్‌కు ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వస్తున్నాయని అన్నారు. ప్రజలకు సేవ చేయడం భగవంతుడికి సేవచేయడమేనని, అలాంటి భావన లేకుంటే ఏ పార్టీ కూడా రాణించదని అన్నారు.

ఉపాధ్యాయులు ఫుల్..

నర్సింహులపేట, విద్యార్థుల సంఖ్యను పెంచి.. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు శాతాన్ని మాత్రం పెంచలేకపోతున్నారు.దీంతో ప్రభుత్వ పాఠశాలలు మూత"బడే"పరిస్థితి నెలకొంది. జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభించి బడిబాట కార్యక్రమం నిర్వహించినా..అరకొర విద్యార్థులే చేరారు.ఇప్ప

అసమర్థ పాలనతోనే వారికి ఈ దుస్థితి

హైదరాబాద్, సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థత పాలన వల్ల ఆ పార్టీ నాయకులు ప్రజల్లోకి వెళ్లే పరిస్థితి లేదని, ఒకవేళ వెళితే మాత్రం వెంటపడి మరీ తంతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా పోలీస్ సెక్యూరిటీ లేకుండా బయట తిరిగే అవకాశం లేదని చెప్పారు. ప్రజలు తిడుతున్న తిట్లకు రేవంత్ రెడ్డి కాకుండా వేరే వాళ్లు ఉంటే ఆత్మహత్య చేసుకునేవారని ఆరోపించారు. తెలుగు భాషలో ఉన్న అన్ని తిట్లను ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిడుతున్నారని చెప్పారు. సిర్పూర్ కాగజ్‌నగర్ బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశం శనివారం తెలంగాణ భవన్‌లో జరిగింది. స్థానిక ఎన్నికలపై బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. 140ఎకరాల భూమి కోసం కొడంగల్‌ల్లోని ఒక ఊరికి 450మంది పోలీసులను సీఎం రేవంత్ పంపించారని ఆరోపించారు. తెలంగాణలో పేదవాళ్లు బతుక వద్దా అని ప్రశ్నించారు. ఖచ్చితంగా వాళ్ల ఇళ్లను, దుకాణాలను రేవంత్ రెడ్డి కూలగొడతారని అన్నారు. అప్పుడప్పుడు సూర్యుడు కూడా మబ్బుల చాటుకు వెళ్తాడని.. కేసీఆర్ కూడా తప్పకుండా తిరిగి ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. సిర్పూర్ కాగజ్‌నగర్‌తో తనకు వ్యక్తిగతంగా అనుబంధం ఉందని తెలిపారు. కాగజ్ నగర్‌లో బీఆర్ఎస్‌ను బలోపేతం చేశామని అన్నారు. కాగజ్‌గర్ పేపర్ మిల్లును తెరిపించేందుకు అన్ని రకాలుగా ప్రయత్నం చేశానని గుర్తుచేశారు. కేసీఆర్‌తోనే బహుజనుల అభివృద్ధి జరుగుతుందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నమ్మారని తెలిపారు. 8మంది చొప్పున కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణ నుంచి గెలిచిన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తెచ్చింది శూన్యమని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వలేమని చెప్పినా.. ఒక్క కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఎందుకు నోరు మెదపలేదని నిలదీశారు. లోక్‌సభలో తాము ఉండుంటే కేంద్ర ప్రభుత్వంపై కోట్లాడే వారమని కేటీఆర్ తెలిపారు.

గులాబీ బాస్‌కు భయం..!

హైదరాబాద్, తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల వేడి రాజుకుంటున్నా రెండు సార్లు అధికారం చెలాయించిన బీఆర్ఎస్‌లో మాత్రం చలనం కనిపించడం లేదు. తమకు అంతో ఇంతో పట్టున్న కరీంనగర్ నుంచి తాము పోటి చేస్తామని పలువురు ఆశావహులు ముందుకొస్తున్నా.. గులాబి బాస్ మాత్రం పోటీకి ససేమిరా అంటున్నారంట. ఏ ఎన్నికలు అయినా ఉప ఎన్నికలు అయినా సై అంటూ గేరు మార్చి స్పీడ్ పెంచే కారు పార్టీలో ఈ సారి మాత్రం అసలు కదలికే కనిపించడం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల పర్వం కొనసాగుతున్నా.. ఆ పార్టీ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఇప్పటికీ ఇంకా సైలెంట్‌గా ఉండడానికి కారణం ఏంటి?తెలంగాణ రాష్ట్రం లో ఖాళీ అయిన రెండు ఉపాధ్యాయ, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకి నోటిఫికేషన్ విడుదల అయ్యింది. నామినేషన్ల పర్వం కొనసాగుతుంది.. అయితే ఆ ఎన్నికలతో తమకేం సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారు గులాబీ పార్టీ పెద్దలు.. లోక్‌సభ ఎన్నికల ఫలితాల ఎఫెక్ట్‌తో.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ అంటే భయపడి పోతున్నట్లు కనిపిస్తున్నారు. నామినేషన్ల పర్వం కొనసాగుతున్న ఇప్పటికి పోటీ చేసే విషయంలో స్పష్టత ఇవ్వడం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా పరాజయం పాలైతే ఆ ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై మరింత రిఫ్లెక్ట్ అవుతుందన్న ఆందోళనతో ఈ ఎన్నికలకు దూరంగా ఉండాలని భావిస్తున్నారంట.వాస్తవానికి పట్టభద్రులు, ఉపాధ్యాయులకి పదేళ్లలో బిఆర్ఎస్ పార్టీ చేసిందేమి లేదు. ముఖ్యంగా ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రెండు సార్లు అధికారంలో ఉన్న పట్టభద్రుల సమస్యలు తీర్చడంలో బిఆర్ఎస్ పూర్తిగా విఫలం అయ్యిందన్నది కాదనలేని వాస్తవం.. ఇది గత ఎమ్మెల్సీ ఎన్నికలలోనే రుజువు అయ్యింది. శాసనమండలిలో ప్రశ్నించే గొంతుక ఉండాలని అధికారం లో ఉన్న బీఆర్ఎస్‌ని కాదని పెద్దాయన జీవన్ రెడ్డి కి పట్టం కట్టారు కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఓటర్లు.అధికారం లో ఉన్నప్పుడే పట్టభద్రులు తిరస్కరించడంతో.. ఈసారి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేయాలంటేనే ఆమడ దూరంలో ఉంటుంది బీఆర్ఎస్.. అసెంబ్లీ ఎన్నికలలో పరాజయంతోనే కుంగి పోయిన కారు పార్టీకి పార్లమెంటు ఎన్నికలలో కోలుకోలేని దెబ్బ తగిలింది. ఒక్క ఎంపీ సీటు కూడా గెలుచుకోలేక గుండుసున్నాకే పరిమితం అయ్యింది. రెండు సార్లు అధికారం వెలగపెట్టిన ఆ పార్టీకి సగం లోక్‌సభ స్థానాల్లో డిపాజిట్లు కూడా దక్కలేదంటే.. ప్రజలు ఆ పార్టీని ఏ స్థాయిలో తిరస్కరించారో అర్థమవుతుంది.ఆ దెబ్బతో పార్లమెంటు ఎన్నికల తరువాత గులాబాస్ కెసిఆర్ పూర్తిగా ఫాంహౌస్ కే పరిమితం అయ్యారు. ఆయన అధికారం లో ఉన్నప్పుడు ఏనాడు కూడా బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణం పై దృష్టి పెట్టలేదు. ఎవరిని నిలబెట్టినా తన ముఖం చూసి ఓటేస్తారన్న ఓవర్ కాన్ఫిడెన్స్‌తో సంస్థాగతం పార్టీని బలోపేతం చేయాలన్న అంశాన్నే పట్టించుకోలేదు. ఆ ప్రభావం ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. గతంలో బీఆర్ఎస్‌లో చేరడానికి నేనంటే నేనని పోటీ పడి వచ్చిన నాయకులు ఇప్పుడు నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఉద్యమం సమయం నుంచి ఆ పార్టీతో ఉన్న వారు తప్ప అధికారాన్ని చూసి వచ్చి చేరిన వారంతా కారు దిగేసి ఎవరి దారి వారు చూసుకుంటున్నారు.పార్లమెంటు ఎన్నికల తరువాత కేసీఆర్ ప్రజలకు దూరమవ్వడంతో.. బీఆర్ఎస్ పార్టీ జవసత్వాలు లేకుండా తయారైంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులు ఎంత బూస్టప్ ఇవ్వడానికి ట్రై చేస్తున్నా.. వలసలు మాత్రం ఆగడం లేదు. ఉన్న నాయకులు, కేడర్ కూడా పార్టీ పిలుపు ఇస్తే తూతు మంత్రంగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇంత జరుగుతున్నా బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణం కోసం ఒక్కటంటే ఒక్క మీటింగ్ కూడా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఓటమి తరువాత నిర్వహించలేకపోయారు.అటు చూస్తే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెలాఖరులో భారీ బహిరంగసభ అంటున్నారు. ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయి. అదే రోజు ఫలితాలు వెలువడతాయి. అంటే 28 రోజులు మాత్రమే ఉండే ఫిబ్రవరి నెల ఆఖరులో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. మరి అటువంటప్పుడు కేసీఆర్ భారీ బహిరంగ సభ ఎలా పెడతారో? అన్న డౌట్లు గులాబీ శ్రేణుల్లోనే వ్యక్తమవుతున్నాయి.ఏడాది నుంచి కేసీఆర్ ఫాం హౌస్‌కే పరిమితమై .. అప్పుడప్పుడు స్టేట్‌మెంట్లకు పరిమితమవుతుండటంతో గులాబీ కేడర్ ఆయన్ని నమ్మే పరిస్థితి లేకుండా పోయింది. అది గ్రహించే అసలు ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న సంగతే మర్చిపోయినట్లు కేసీఆర్ వ్యవహరిస్తున్నారంట. స్థానిక సంస్థలు సమీపించడానికి ముందు ఎమ్మెల్సీ పోరులో నిలబడి అంతో ఇంతో సత్తా చాటుకుంటే పార్టీకి జవసత్వాలు వచ్చేవని.. అయితే ఆయన అసలుకే కాడె వదిలేయడం కేడర్‌కు మింగుడు పడటం లేదంట. దాంతో క్యాడర్ కూడా అధిష్టానం లేని పట్టింపు మాకేం అనుకుంటున్నారో ఏమో అసలా ఎన్నికల గురించి ఆలోచించడమే మానేశారు.తెలంగాణలో బీఆర్ఎస్ గ్రౌండ్ లెవల్ నుండి బలంగా ఉండేది. ఉద్యమ పార్టీ నుంచి పొలిటికల్ పార్టీగా మారడంతో గట్టి క్యాడరే ఉంది. అయితే ఇప్పుడు కార్యకర్తలకి దిశానిర్దేశం చేసేవారే కరువయ్యారు. అటూ కేసీఆర్ పూర్తిగా రెస్ట్‌లో ఉండడం.. దిశానిర్దేశం చేయాల్సిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి కేసులతో అవినీతి మరకలు అంటుకోవడం..

అవినీతి కూపం..ఆప్‌కు శాపం

న్యూఢిల్లీ,అవినీతికి వ్యతిరేకంగా జన్‌లోక్‌పాల్ వ్యవస్థను తీసుకురావాలని గాంధేయవాది అన్నా హజారే 2011లో దీక్ష సాగించినప్పుడు ఆ ఉద్యమంతో ఎదిగిన ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ ఈసారి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోవడం చారిత్రక పరిణామం. ఆనాడు అవినీతి వ్యతిరేక ఉద్యమం వల్లనే కేజ్రీవాల్‌కు విపరీతమైన క్రేజీ వచ్చింది. అధికార వ్యవస్థలో వేళ్లూనుకుపోయిన అవినీతి, లంచగొండితనాన్ని భరించలేకపోయిన ఢిల్లీ ప్రజలకు ఆప్ ఒక ఆశాకిరణంగా కనిపించింది. ఆమ్‌ఆద్మీ పార్టీ ఏర్పాటైన కొద్ది నెలల్లోనే 2013 లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు కాంగ్రెస్‌కు ఉన్న ఓటు బ్యాంకు చాలా వరకు ఆప్‌కు మళ్లింది.ఆ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాల్లో కాంగ్రెస్ 8 స్థానాలతో సరిపెట్టుకోగా, ఆప్ 28 స్థానాలను సాధించి కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగింది. కొద్ది కాలానికే ప్రభుత్వం పడిపోవడంతో 2015లో ఎన్నికల్లో ఏకంగా 67 సీట్లు సాధించుకుని ప్రధాన రాజకీయ పక్షాలకు ఆశ్చర్యం కలిగించింది. 2020లో 62 సీట్లు గెలుచుకోగలిగింది. ఢిల్లీ అంటే ఆమ్‌ఆద్మీకి కోటగా కేజ్రీవాల్ మార్చినప్పటికీ మూడోసారి ముఖ్యమంత్రిగా ఉన్న పదవీకాలంలోనే ఆప్‌సర్కారు అవినీతి ఊబిలో కూరుకుపోయింది. అవినీతి మరకలు, కుంభకోణాలు ఆప్ పార్టీ పాలిట శాపంగా మారాయి. మరోసారి ఎలాగైనా ప్రజలు తనను గెలిపిస్తారన్న ధీమాతో కేజ్రీవాల్ ఉన్న తరుణంలో తానే ఓటమిపాలవ్వడం జీర్ణించుకోలేని విషయం. ఈ పరిస్థితిని ఎగ్జిట్ పోల్స్ ముందుగానే అంచనా వేశాయి. ఇటీవల సీ ఓటరు సర్వే కూడా ఆప్ సర్కారుపై 43.9 శాతం మంది ఆగ్రహంతో ఉన్నారని, ప్రభుత్వం మారాలనుకుంటున్నారని వెల్లడించింది. మరో 10.9 శాతం మంది కూడా అసంతృప్తితో ఉన్నారని పేర్కొంది. మొత్తం మీద 55 శాతం మంది ఆప్ సర్కారుపై అసంతృప్తిగా ఉన్నారని తేల్చింది.దీని ప్రకారమే ఇప్పుడు ఫలితాలు వెలువడడం గమనార్హం. ఢిల్లీ ఓటర్ల సంఖ్య 1.55 కోట్లు. వీరిలో 67 శాతం మంది మధ్యతరగతి వారే. వారి మనస్తత్వంలో మార్పు వచ్చింది. బడ్జెట్‌లో ఆదాయం పన్ను మినహాయింపు ద్వారా ఢిల్లీలోని మధ్యతరగతిని బిజెపి ఆకట్టుకోగలిగిందని చెబుతున్నారు. బిజెపి 'వికసిత్ ఢిల్లీ సంకల్ప్ పత్ర' మేనిఫెస్టో మంత్రం ఢిల్లీ ఓటర్లపై పనిచేసిందని అంటున్నారు. 1998 నుంచి ఢిల్లీలో అధికారంలో లేకపోవడంతో ఈసారి ఎలాగైనా ఢిల్లీ కోటలో పాగా వేయాలని ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డాతో సహా కమలనాథులు సర్వశక్తులూ ఒడ్డారు. కేజ్రీవాల్, సిసోడియా, సత్యేంద్ర జైన్ తదితర ఆప్ నేతలను దోషులుగా ఓటర్ల ముందు ముద్ర వేయించారు. కేజ్రీవాల్ సర్కారు గత పదేళ్లలో విద్య, వైద్య రంగాల్లో అనేక వినూత్న పథకాలను అమలు చేయడంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి ఆకర్షణలతో ప్రజలను ఆకట్టుకోగలిగింది. ప్రజాపాలనలో ఆమ్‌ఆద్మీ పాలన ఓ ప్రత్యేక నమూనాగా విస్తృత ప్రచారం కల్పించిన ఆప్ సర్కారు అవినీతి ఆరోపణల ఊబిలో కూరుకుపోవడంతో ప్రతిష్ఠ మసకబారింది. ఢిల్లీలో ప్రజలు కలుషిత నీరు, రోడ్ల అధ్వానంపై తీవ్ర అసంతృప్తి చెందుతుండడంతో యమునా నది నీటిని హర్యానా ప్రభుత్వం విషంగా మార్చి సరఫరా చేస్తుందని ప్రచారం సాగించారు. కానీ ఈ ప్రచారం పనిచేయలేదు.



ప్రధాని మోడీ తాను ఆ నీటినే తాగుతానని ప్రచారంలో స్పష్టం చేశారు.హర్యానా సిఎం సైనీ కూడా ఆ నీటిని తాగి చూపించడంతో కేజ్రీవాల్ ఆరోపణలకు నమ్మకం లేకుండా పోయింది. మూడేళ్ల క్రితం కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ సర్కారు తీసుకొచ్చిన నూతన మద్యం విధానంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 2026 కోట్ల భారీ నష్టం వాటిల్లిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తన నివేదికలో బయటపెట్టడం ఆప్‌కు తీరని ఇబ్బంది తెచ్చిపెట్టింది. దీనికి తోడు ఢిల్లీ సిఎం అధికార నివాసం శీష్ మహల్‌కు దాదాపు 33 కోట్ల రూపాయల ప్రజాధనంతో మరమ్మతులు చేపట్టినట్టు కాగ్ నివేదిక వెల్లడించింది. ఇవన్నీ కేజ్రీవాల్ పాలనను ఎండగట్టడానికి బిజెపితో పాటు ఇతర విపక్షాలకు ఆయుధాలుగా ఉపయోగపడ్డాయి. విద్యావంతులైన ఓటర్లు ఈ అవినీతిని మనసులో పెట్టుకుని కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా కేజ్రీవాల్ జైలు నుంచి వచ్చి ప్రచారం చేసినా ఢిల్లీలో ఒక్కచోట కూడా ఆప్ అభ్యర్థిని గెలిపించలేకపోయారు.పంజాబ్‌లో ఆప్ మూడు స్థానాలకే పరిమితం కాగా, హర్యానాలో కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయింది. అప్పటికే కేజ్రీవాల్ ప్రతిష్ఠ మసకబారిందన్న విశ్లేషణలు బయటపడ్డాయి. కేజ్రీవాల్, సిసోడియా, సత్యేంద్ర జైన్ తదితరులు జైలుకు వెళ్లి వచ్చి ప్రజల సానుభూతి పొందడానికి ఎంతగానో ప్రయత్నించారు. కేంద్రంలోని కమలనాథుల కుట్రవల్లనే తమపై కేసులు బనాయించి జైళ్లకు తరలించారని చెప్పుకొచ్చారు. అయినా ఓటర్ల సానుభూతి పొందలేకపోయారు. ఎన్నికల ముందు ఏడుగురు ఎంఎల్ఎలు ఆప్‌కు గుడ్‌బై చెప్పడం గట్టి ఎదురు దెబ్బతగిలింది. ఆప్ ఎంఎల్ఎ అభ్యర్థులకు ఎరవేసి, తమ పార్టీని అస్థిరపరిచేందుకు బిజెపి 'ఆపరేషన్ లోటస్' కు కుట్ర పన్నుతోందని కేజ్రీవాల్ ఆరోపణలు గుప్పించడం తీవ్ర రాద్ధాంతానికి దారి తీసింది. పలువురు ఎంఎల్ఎ అభ్యర్థులకు ఫోన్ కాల్స్ చేసి రూ.15 కోట్లు ఇప్పిస్తామని ఆశపెట్టినట్టు కేజ్రీవాల్, సహచర నేతలు ఆరోపించడం చివరకు ఎసిబి విచారణకు దారి తీసింది. ఒకప్పుడు హ్యాట్రిక్ విజయాలతో ఢిల్లీ రాష్ట్ర పీఠంపై కూర్చున్న కాంగ్రెస్ ఇప్పుడు ఆ పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారింది.

విలువలతోనే పత్రికల మనుగడ

హైదరాబాద్,ప్రింట్ మీడియా సంక్షోభం, భవిష్యత్తు అనే అంశం గురించి మాట్లాడుకునే ముందు అసలు భారతదేశంలోకి ప్రింట్ మీడియా ఎలా వచ్చిందనే విషయం గురించి చెప్పుకోవాలి. నిజానికి భారత పత్రికారంగ చరిత్ర చాలా అపూర్వమైనదీ, పురాతనమైనదీ కూడా. మన దేశంలో 245 సంవత్సరాల క్రితం మొట్టమొదటి పత్రిక ప్రారంభమైంది. అది కూడా భారతీయుడు ప్రారంభించింది కాదు, ఐర్లాండ్ దేశానికి చెందిన జేమ్స్ అగస్టే హిక్కి అనే ఒకాయన అప్పటి బ్రిటిష్ ఇండియా రాజధాని కలకత్తాలో 'బెంగాల్ గెజిట్' అనే పత్రిక ప్రారంభించారు. అప్పట్లో బ్రిటిష్ ఇండియాకి కలకత్తా రాజధానిగా ఉండేది. అక్కడే ఈ పత్రిక ఎందుకు ప్రారంభించారంటే అప్పటి బ్రిటిషర్ల వినోదం కోసం అని చెప్పాడాయన. ఆ తర్వాత ఆ పత్రిక.. జనానికి సమాచారం అందజేసే దినపత్రికగా రూపాంతరం చెందింది.ఆ తర్వాత స్వాతంత్ర్య పోరాట కాలంలో మన నాయకులు చాలా మంది పత్రికలు నడిపారు. మహాత్మా గాంధీ యంగ్ ఇండియా, హరిజన్, నవజీవన్, ఇండియన్ ఒపీనియన్ వంటి పత్రికలు నడిపారు. బాబా సాహెబ్ అంబేద్కర్.. మూర్తినాయక్, బహిష్కృత భారత్ అనే రెండు మరాఠీ పత్రికలు నడిపారు. జవహర్ లాల్ నెహ్రూ నేషనల్ హెరాల్డ్ అనే పత్రికను స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే ప్రారంభించారు. అది చాలా కాలం మనుగడలో ఉంది. ఇప్పుడు ఆ పత్రిక 'టెయింటెడ్'గా తయారైంది. దానిపై ఎన్నో కేసులు వస్తున్నాయి.మోతీలాల్ నెహ్రూ ఇండిపెండెంట్ అనే పత్రిక ప్రారంభించారు. ఆయన 'హోమ్ రూల్ ఫర్ ఇండియా' అనే నినాదంతో ఆయన ఈ పత్రిక నడిపారు. లాలా లజపతి రాయ్ ఉర్దూలో 'వందేమాతరం' పేరిట పత్రిక నిర్వహించారు. ఇదంతా ఎందుకు చెప్పవలసి వస్తున్నదంటే, స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేసే క్రమంలో పత్రికలు ఉండాల్సిన అవసరం ఉందని అప్పట్లో భావించారు. ఇలా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న నాయకులు, యోధులు చాలామంది స్వాతంత్ర్య పోరాటం గురించి ప్రజలకు సమాచారం తెలియాలని భావించి పత్రికలు నడిపారు.అప్పట్లో ఒక లక్ష్యంగా ప్రారంభమైన పత్రికల స్వభావం క్రమక్రమంగా ఎలా మారుతూ వచ్చిందో చెప్పుకోవాలి. స్వాతంత్ర్యం వచ్చాక, తమ లక్ష్యం నెరవేరింది కాబట్టి ఇక ఈ పత్రికలు ఎందుకు? అంటూ తొలి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ అధ్యక్షతన ఒక సమావేశం జరిగింది. చాలా మంది 'ఇక ఇప్పుడు పత్రికలు అవసరం లేదు' అన్నారు. ఎందుకంటే అప్పటికే పత్రికల్లో అసత్యాలు, అర్ధ సత్యాలు రాయడం మొదలైంది. అయితే మెజారిటీ పత్రికలు అలా లేవు. అవి విలువల్ని పాటిస్తూ, ప్రజలకు సమాచారం తెలిపే బాధ్యత నిర్వర్తిస్తున్నాయి. అయితే 'ఇక పత్రికలు ఎందుకు?' అనే వాదనను జవహర్ లాల్ నెహ్రూ అంగీకరించలేదు. 'పత్రికలు ఏం రాసినా సరే, అవి ఉండాల్సిందే. ప్రజాస్వామ్యంలో పత్రికలు అనేవి అవసరం' అని నొక్కి చెప్పడమే కాకుండా, వాటికి ఒక ప్రత్యేకమైన హోదా ఉండాలంటూ ఆయన 1952లో ఒక ప్రెస్ కమిషన్ వేశారు. ప్రెస్ కమిషన్ నివేదికలో భాగంగానే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆవిర్భవించింది.అలాగే సమాచారాన్ని సేకరించి వార్తలు రాసి ప్రజలకు అందజేసే పనిని ఒక పవిత్ర లక్ష్యమని నెహ్రూ పేర్కొన్నారు. కాబట్టి జర్నలిస్టులకు ఒక ప్రత్యేకత ఉండాలి. అందరిలాగా ఉండకూడదు అని చెప్పి ఆయన వర్కింగ్ జర్నలిస్టుల చట్టం తీసుకొచ్చారు. ఈ చట్టం ప్రకారం ఉద్యోగ భద్రతతో సహా చాలారకాల వెసులుబాట్లు కల్పించారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి వేజ్ బోర్డు వేయాలని కూడా ప్రెస్ కమిషన్ సిఫారసు చేసింది. అయితే ఇప్పుడున్న ప్రభుత్వాలు ఈ చట్టాలన్నిటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చాయి. అంటే, ఇవాళ జర్నలిస్టులకు, ఇతర రంగాల్లో పని చేస్తున్నవారికీ తేడా ఏమీ లేదన్నమాట. ఆ నిబంధనలు ఇంకా అమలులోకి రానప్పటికీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం వాటిని అమలు పరచడానికి సిద్ధంగా ఉంది. నెహ్రూ అంత ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్నప్పటికీ, ఆయన కుమార్తె ఇందిరా గాంధీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమర్జెన్సీ విధించి ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాని రద్దు చేశారు.వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటన స్వేచ్ఛ లేకుండాపోయాయి. 1978లో జనతా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొరార్జీ ప్రభుత్వం రెండవ ప్రెస్ కమిషన్ వేసి, ప్రెస్ కౌన్సిల్‌ను పునరుద్ధరించింది. ఈ మార్పులన్నీ జరుగుతున్న సమయంలోనే వార్తా పత్రికలు వ్యాపార దృష్టిని అలవరచుకోవడం మొదలుపెట్టాయి. అంటే.. లక్ష్యం నుంచి వృత్తిగా మారి, వృత్తి నుంచి వ్యాపారం వైపు పత్రికలు మళ్ళిన తర్వాతనే ప్రింట్ మీడియా పతనం ప్రారంభమైంది. పతనం అంటే చాలా మంది అంగీకరించకపోవచ్చు. నా ఉద్దేశంలో పతనమంటే పత్రికలు లేకుండాపోవడం కాదు, విలువల రీత్యా పతనం ప్రారంభమైందని. వార్తాపత్రికలను ఏ ఉద్దేశంతో నడపాలో, ఏ లక్ష్యం కోసం పనిచేయాలో వాటినుంచి యాజమాన్యాలు పక్కకు జరిగి ధనార్జన ధ్యేయంగా చేసుకున్నాయి.ఎనభయ్యవ దశకం చివర్లో ఈ ధోరణి ప్రబలింది. అప్పట్లో నేను 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో పని చేస్తున్నాను. ఒకసారి మా యజమాని ఒక పుస్తకం పంపించారు. దానిమీద 'మీరు చదవండి, పత్రికలో పని చేస్తున్న హెడ్స్ అందరితో కూడా చదివించండి' అని నోట్ పెట్టారు. అదొక అమెరికన్ రచయిత రాసిన పుస్తకం. దాని శీర్షిక ఏమిటంటే 'వేర్ ది న్యూస్ రూమ్స్ ఆర్ రూల్ బై ఎంబిఏస్' అని. అంటే మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చేసిన వాళ్ళు న్యూస్ రూమ్స్‌లో పై పొజిషన్స్‌లో ఉండాలని దాని అర్థం. పత్రికలతో వ్యాపారం ఎలా చేయొచ్చు అని చెప్పే ఆ పుస్తకాన్ని నేను చదవలేదు సరికదా ఎవరికీ ఇవ్వలేదు కూడా. ఆ పుస్తకం చదివి అందరూ వ్యాపారం చేయడం మొదలుపెడితే పత్రికల్లో వార్తలు రాసేవారు ఎవరూ ఉండరని నేను ఆ పుస్తకాన్ని భద్రంగా కప్ బోర్డులో పెట్టి, ఆ పత్రికకు రాజీనామా చేసిన రోజున దాన్ని నాతోపాటే తీసుకువెళ్లిపోయాను.1990 చివర్లలో 24 గంటల న్యూస్ ఛానళు వచ్చాక ప్రింట్ మీడియా ప్రాభవం పూర్తిగా తగ్గిపోవడం మొదలైంది. డిజిటల్ మీడియా విజృంభణతో ఇంటర్నెట్, మొబైల్ పరికరాలు సమాచారాన్ని మరింత చేరువ చేశాయి. ఏదైనా సంఘటన జరిగిన మరుక్షణమే అందరికీ తెలిసేలా చేస్తున్నాయి. అదే సమాచారాన్ని వార్తా పత్రిక మరునాడు మనకు అందిస్తున్నది. దీంతో ఉదయం పేపర్ తెరవగానే అన్ని చద్దివార్తలే కనబడుతున్నాయి. వార్తా పత్రికల చెల్లుబాటు తగ్గడానికి ఇదొక కారణం. యువతరం అలవాట్లు మారుతున్నాయి. మొబైల్ డివైస్‌లకు అలవాటు పడిన యువత పత్రికను చేతిలో పట్టుకోవాలంటే నామోషిగా భావిస్తున్నారు. తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చాక జర్నలిస్టుల పనులన్నీ కూడా ఈ తరహా యాప్ లే చేసేస్తున్నాయి. వార్తా ఛానళ్లు వచ్చాక చదవడానికంటే చూడటానికే జనం ప్రాధాన్యం ఇస్తున్నారు.ఆ తర్వాత మరో ముఖ్యమైన మార్పు.. అడ్వర్టయిజ్‌మెంట్ షిఫ్ట్. పత్రికలకు ఆదాయం వచ్చేది అడ్వర్టయిజ్‌మెంట్ల ద్వారానే. ఇవి ఎలక్ట్రానిక్ మీడియాకు షిఫ్ట్ కావడంతో పత్రికలకు ఆదాయం తగ్గుముఖం పట్టింది. ఫలితంగా వ్యాపార ప్రయోజనాలు ఆశించే యాజమాన్యాలు పత్రికలు నడపడానికి ఇష్టపడటం లేదు. చాలా పత్రికలు మూతపడుతున్నాయి.

రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలి

హైదరాబాద్,:కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన పథకాల్లో రైతు భరోసా ఒకటి. ఈ పథకం కింద రాష్ట్రంలోని రైతులకు ఏడాదికి రెండు సీజన్‌లలో ఎకరానికి రూ. 6వేలు చెప్పున పెట్టుబడి సాయం అందిస్తోంది. తొలి విడతలో ఎకరం భూమి ఉన్న రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం ప్రారంభించారు. క్రమంగా సాగుకు యోగ్యమైన భూమి ఉన్న అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులను జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రైతుల సంఖ్య పెరిగింది.. బీఆర్ఎస్ హాయాంలో తీసుకొచ్చిన రైతు బంధు పథకాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసి సాగుకు యోగ్యం కాని భూములను తొలగించారు. దీంతో రైతు భరోసా నిధుల జమకు కొంత ఆలస్యం అయింది. అయితే పెట్టుబడి సాయం పొందే రైతుల సంఖ్య మాత్రం పెరిగినట్లు అధికారుల లెక్కలు చెప్తున్నాయి. జనవరి 26న రైతు భరోసా పథకం ప్రారంభోత్సవంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాలో 563 గ్రామాల్లో 9లక్షల 48వేల 333 ఎకరాలకు రూ.4,41,911 మంది అన్నదాతలకు రూ. 6వేల చొప్పున రూ. 569 కోట్ల పెట్టుబడి సాయం అందించారు. తొలుత ఎకరం భూమి ఉన్న రైతులు, ఆ తర్వాత ఆపైన ఉన్నవారికి క్రమంగా నగదు జమ అవుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. రైతు భరోసా డబ్బులు రాలేదా..? రైతు భరోసా డబ్బులు జమ కాని రైతులు సంబంధిత ఏఈఓ,ఏఓలను సంప్రదించాలి. వాళ్లు సాంకేతిక కారణాలు ఏమైనా ఉన్నాయా ? చూసి వాటిని పరిష్కరించి సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారని అధికారులు సూచించారు. అంతేకాక కొత్తగా అంటే జనవరి 1 వరకు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు స

జగన్‌తో సాయి రెడ్డి సమరానికి సిద్ధమా?

అమరావతి, గద్దె దిగిపోయినా అధికారంపై ధీమా వ్యక్తం చేస్తున్న జగన్ తన క్రెడిబిలిటీ గురించి తెగ ఊదరగొడుతున్నారు. విశ్వసనీయత, విలువలపై మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా అన్నారో? లేకపోతే పొరపాటున నోరు జారారో కాని విజయసాయిరెడ్డిని టార్గెట్ చేయాలని చూశారు. దానికి సాయిరెడ్డి వెంటనే కౌంటర్ ఇచ్చారు. ఆ వెంటనే షర్మిల మీడియా ముందుకొచ్చి జగన్ తన స్వార్థం కోసం సాయిరెడ్డిని ఎంతో టార్చర్ పెట్టాలని ఆరోపించి తీవ్ర కలకలం రేపారు. తన లోటుపాట్లు, అంతర్గత వ్యవహారాలన్ని తెలిసిన విజయసాయిని జగన్ టచ్ చేయడం ఆయనకే బూమరాంగ్ అవుతుందా? ఇంతకాలం జగన్ చెప్పిందే వేదం అన్నట్లు నడుచుకున్న విజయసాయి ఇక జగన్‌తో అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధమయ్యారా?లండన్ ట్రిప్ నుంచి రాగానే ఎన్నికల్లో విజయంపై బోల్డు ధీమా వ్యక్తం చేస్తున్నారు మాజీ ముఖ్యమంత్రి జగన్.. వచ్చే ఎన్నికల్లో గెలిచి ఏకంగా 30 ఏళ్లు అధికారంలో కొనసాగుతానని తన జోస్యం తానే చెప్పేసుకుంటున్నారు. పవర్ పోయి 8 నెలలు కాకుండానే మళ్లీ గెలుస్తాం.. 30 ఏళ్లు నేనే ముఖ్యమంత్రిగా ఉంటానని పాత పాట అందుకున్నారు. వైసీపీ రాష్ట్రాన్ని ఏలుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అక్కడితో ఆగితే బాగుండేదేమో.. కాని ఆ సెల్ఫ్ జాతకం చెప్పుకుంటున్న క్రమంలో ఆయన పార్టీని వీడిన కీలక నేతలు, రాజీనామా చేసిన మాజీ రాజ్యసభ సభ్యుల విశ్వసనీయత గురించి మాట్లాడారు.జగన్ ఆ ప్రెస్‌మీట్లో ముందు తాను చెప్పాలనుకుంది చెప్పేశారు. తర్వాత ఎవరో రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు రియాక్ట్ అయిన ఆయన క్రెడిబిలిటీ గురించి లెక్చర్ ఇచ్చారు. అది ఆయన ఉద్దేశపూర్వకంగా మాట్లాడారో? లేకపోతే ఆ ఫ్లోలో అనాలోచితంగా నోరు జారారో కాని అది ఇప్పుడు ఆయనకు బూమరాంగ్ అవుతుంది. జగన్ వ్యాఖ్యలపై అక్రమ ఆస్తుల కేసుల్లో జగన్ సహ నిందితులు, మాజీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మోపిదేవి వెంకటరమణలు వెంటనే రియాక్ట్ అయి కౌంటర్ ఇవ్వడంతో.. జగన్ క్రెడిబిలిటీ గురించి మాట్లాడి సెల్ఫ్‌గోల్ చేసుకున్నారన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.ముఖ్యంగా విజయసాయిరెడ్డి వైసీపీ స్థాపన దగ్గర నుంచి జగన్ వెన్నంటే ఉన్నారు.. అంతకు ముందు జగన్ తండ్రి, తాతల హయాం నుంచి ఆడిటర్ అయిన సాయిరెడ్డికి ఆ కుటుంబంతో అనుబంధం ఉంది. జగన్ లోటుపాట్లు, ఆర్థిక మూలాలు, లావాదేవీల లెక్కలు ఒక ఆడిటర్‌గా సాయిరెడ్డి వేళ్ల మీద ఉంటాయి. వైఎస్ ఫ్యామిలీతో ఉన్న అనుబంధంతో ఆయన మొదటి నుంచి జగన్‌కు వీరవిధేయుడి గానే వ్యవహరిస్తూ వచ్చారు. అక్రమాస్తుల కేసులో జగన్‌తో కలిసి 16 నెలలు రిమాండ్ ఖైదీగా గడిపారు . పార్టీ పదవికి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసినప్పుడు కూడా సాయి రెడ్డి ఆయన్ని పల్లెత్తు మాట అనలేదు.రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించి, రాజ్యసభ పదవికి రాజీనామా చేసిన సాయిరెడ్డి లోటస్‌పాండ్‌లోని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఇంటికి వెళ్లడం, దాదాపు 3 గంటల పాటు భేటీ అవ్వడం రాజకీయవర్గాల్లో సంచలనం సృష్టించింది. జగన్, షర్మిలల మధ్య కుటుంబ, రాజకీయ విభేదాలు తీవ్రస్థాయిలో ఉన్న నేపథ్యంలో విజయసాయిరెడ్డి స్వయంగా వెళ్లి షర్మిలను కలవడం రకరకాల చర్చలకు తావిచ్చింది. విజయసాయిరెడ్డిపై అనేక సందర్భాల్లో షర్మిల ఘాటైన విమర్శలు చేశారు. వివేకానందరెడ్డి గుండెపోటుతో మృతి చెందారని విజయసాయి ప్రకటించడంపైనా ఆమె అభ్యంతరం తెలిపారు.అలాంటి షర్మిలతో భేటీ సందర్భంగా విజయసాయి ఏం మాట్లాడి ఉంటారా అన్న ఉత్కంఠ కొనసాగుతున్న సమయంలో షర్మిలే ఆ సస్పెన్స్‌కు తెర దించారు .. విశ్వసనీయత గురించి మాట్లాడిన జగన్‌కు సాయిరెడ్డి కౌంటర్ ఇచ్చిన తర్వాత షర్మిల మీడియా ముందుకొచ్చి ఆయనతో భేటీ సందర్భంగా చర్చకు వచ్చిన అంశాలను ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల వెల్లడించారు. ఈ సందర్భంగా జగన్‌పై ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా ఫోకస్ అయిన విజయసాయి.. వాస్తవానికి జగన్‌తో ఎన్నో ఇబ్బందులు పడ్డారంట.క్యారెక్టర్ అంటే ఏంటో జగన్ మరిచిపోయారని.. అలాంటి జగన్ క్యారెక్టర్ గురించి పెద్ద పెద్ద డైలాగులు చెబుతున్నారని షర్మిల యద్దేవా చేశారు.. వైఎస్ కోరికకు భిన్నంగా అబద్ధం చెప్పాలని విజయసాయిపై ఒత్తిడి తెచ్చినప్పుడు జగన్ క్యారెక్టర్ అర్థమైందని దెప్పిపొడిచారు. సొంత మేనకోడలు, మేనల్లుడు ఆస్తులు కాజేయాలని జగన్ ఎన్నో కుట్రలు చేస్తున్నారని%% తన పిల్లలకు ముఖం చూపించే ధైర్యం జగన్‌కి ఉందా అని ప్రశ్నించారు.అధికారంలో ఉన్నంత కాలం జగన్ అపాయింట్‌మెంట్ దొరకడమే గగనంగా ఉండేది. మంత్రులు, ఎమ్మెల్యేలనే తన ప్యాలెస్ బయట నిలబెట్టేసిన ఆయన.. పరదాల మాటున పనిపాలన సాగించి.. కార్యకర్తలను ఎప్పుడూ పట్టించుకోలేదు. అలా రాచరిక పాలన సాగించిన జగన్ ఓటమి తర్వాత ఇంత కాలానికి వాస్తవ లోకంలోకి వస్తున్నారు. పార్టీ నుంచి పెరిగిపోతున్న వలసలతో బెంబేలెత్తిపోతూ.. వారికి నేనున్నానని భరోసా ఇచ్చేప్రయత్నం చేస్తున్నారు. దానిపై షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.జగన్, షర్మిల లెక్కలు ఎలా ఉన్నా.. ప్రస్తుతం విజయసాయిరెడ్డి ఎపిసోడ్ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. జగన్ లెక్కలు, బొక్కలు అన్నీ తెలిసిన విజయసాయిరెడ్డి ట్వీట్‌తో జగన్‌కు కౌంటర్ ఇచ్చినప్పుడే అందరూ ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. అంతకు ముందే ఆయన షర్మిల నివాసానికి వెళ్లి జగన్ నిర్వాకాలపై ఓపెన్ అయ్యారని తెలిసి ఇప్పుడు వైసీపీ వర్గాలు ఉలిక్కిపడుతున్నాయి. సాయిరెడ్డి రాజీనామా తర్వాత ఒకటొకటిగా వెలుగు చూస్తున్న ఉదంతాలతో ఆయన ఎప్పటి నుంచో జగన్‌పై అసంతృప్తితో ఉన్నారని స్పష్టమవుతుంది. ఇక జగన్‌తో అమీతుమీ తేల్చుకోవడానికి ఆడిటర్ రెడీ అయ్యారన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

కేటీఆర్ కొత్త ప్లాన్.. అలాగైతే మేం రెడీ..

హైదరాబాద్,ఏదో విధంగా నిత్యం వార్తల్లో ఉండేందుకు ప్లాన్ చేస్తున్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ట్రెండ్ తగ్గట్టుగా కొత్త నినాదం ఎత్తుకోకుంటే రాజకీయాల్లో ఉనికి ఉండదని వేగంగా గ్రహించారాయన. ఏదో విధంగా వార్తల్లో ఉండేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లో బీసీల వ్యవహారంపై హాట్ హాట్ చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఆయన అదే పల్లవిని ఎత్తుకున్నట్లు కనిపిస్తోంది.కేటీఆర్ ఏ పల్లవి ఎత్తుకున్నా ఏదో విధంగా బూమరాంగ్ అవుతోంది. ఆయన మాటలను అధికార కాంగ్రెస్, విపక్ష బీజేపీ ఏదో విధంగా చీల్చి చెండాడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ నినాదం ఎత్తుకుంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తూ పోతోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుగా బీసీ కులగణన సర్వే చేపట్టింది. దానిపై అసెంబ్లీలో చర్చ పెట్టింది. తీర్మానం చేసి కేంద్రానికి పంపారు.ఇక రిజర్వేషన్లపై తేల్చాల్సింది కేంద్రం మాత్రమే. అయినా బీసీల రిజర్వేషన్లకు తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. పార్టీ పరంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని అసెంబ్లీ వేదికగా చెప్పారు. ఆ విధంగా అడుగులు వేస్తున్నారు. రేవంత్ సర్కార్ ఎత్తుకున్న బీసీ నినాదం ఇంప్లిమెంట్ అయితే తమ పార్టీకి ఊహించని డ్యామేజ్ జరుగుతుందని భావించారు. ఈ క్రమంలో కొత్త పల్లవి ఎత్తుకుంది ఆ పార్టీ.కులగణనపై రీసర్వే చేస్తే తాము సిద్ధమేనన్నారు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అలా చేస్తే తాను, కేసీఆర్ సైతం వివరాలు ఇస్తామని చెప్పకనే చెప్పారు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చేలా రాజ్యాంగ సవరణ చేయాలంటూ లింకు పెట్టారు. కేటీఆర్ మాటలను గమనించిన అధికార పార్టీ నేతలు, కౌంటరివ్వడం మొదలు పెట్టారు.ఎన్నికల సమయంలో అఫిడవిట్లు ఇచ్చారని, మీరు ఆ తరహా వివరాలు ఇస్తారని, కొత్తగా ఇచ్చేదేముందని అంటున్నవాళ్లు లేకపోలేదు. తండ్రి-కొడుకుల కోసం కొత్తగా కులగణన చేపట్టాలా అంటూ ప్రశ్నిస్తున్నారు హార్డ్ కోర్ కాంగ్రెస్ వాదులు. తమ ప్రభుత్వంలో కులగణన చేసి నివేదికను అసెంబ్లీ వేదికగా బయటపెట్టి చర్చించామని అంటున్నారు. బీఆర్ఎస్ మాదిరిగా తాము సీక్రెట్‌గా ఉంచలేదన్నారు.ఏదో విధంగా బీసీలను ఆకట్టుకునేందుకు రకరకాల మాటలు వద్దని, నిజాలు మాట్లాడాలన్నారు కాంగ్రెస్ నేతలు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో తాము ప్రజల కోసం చేస్తున్న పనులు అన్నీ ఇన్నీకావన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న మీరు ఎందుకు చేయలేదంటూ ప్రశ్నలు రైజ్ చేస్తున్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికి చాటుకునేందుకు కారు పార్టీ తీవ్రంగా ప్రయత్నం చేస్తోందని దుయ్యబడుతున్నారు. ఓ అడుగు ముందుకేసిన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణలో బీఆర్ఎస్ శకం ముగిసిందని మన సులోని మాట బయటపెట్టారు. వచ్చే ఎన్నికల్లో తామే అధికారంలోకి తప్పకుండా వస్తామని వెల్లడించారు. తెలంగాణలో ఎన్నికలు ముగిసినా అధికార పార్టీ-బీఆర్ఎస్ మధ్య నిత్యం మాటల యుద్ధం కంటిన్యూ అవుతూనే ఉందని చెప్పవచ్చు.

తిరుమల నెయ్యి కల్తీలో కీలక పరిణామం.. నలుగుర్ని అరెస్టు చేసిన సీబీఐ

తిరుమల: ఎట్టకేలకు తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో అరెస్టుల పర్వం మొదలైంది. మూడో కంటికి తెలీకుండా విచారణ జరుపుతోంది స్పెషల్ విచారణ టీమ్. లేటెస్ట్‌గా నలుగుర్ని సిట్ అరెస్ట్ చేయడం జరిగిపోయింది. వెంటనే న్యాయమూర్తి వద్ద ప్రవేశపెట్టడం, ఈనెల 20 వరకు ఆయన రిమాండ్ విధించడం చకచకా జరిగిపోయింది. ఈ వ్యవహారంతో వైసీపీ పెద్దల వెన్నులో వణుకు మొదలైంది.తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై తీగలాడితే డొంక కదులుతోంది. న్యాయస్థానం ఆదేశాలతో రంగంలోకి దిగింది సీబీఐ ఆధ్వర్యం లోని స్పెషల్ టీమ్. తిరుపతిలో మకాం వేసింది దర్యాప్తు టీమ్. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఏఆర్ డైయిరీ ఎండీ రాజశేఖరన్‌తో పాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన బిపిన్ గుప్తా, పోమిల్ జైన్, వైష్ణవి డైయిరీ సీఈవో అపూర్వ వినయ్ కాంత్ చావ్డా ఆదివారం సాయంత్రం తిరుపతిలో అరెస్ట్ చేసింది.ఆ తర్వాత వారిని విచారించింది. రాత్రి పదిన్నర గంటల సమయంలో రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి ముందు నిందితులను ప్రవేశపెట్టారు. వారికి ఈనెల 20 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు ఇచ్చారు. ఈ కేసులో ఇవే తొలి అరెస్టులు. త్వరలో పలువురు ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఆనాడు టీటీడీలో కీలకంగా వ్యవహరించిన వైసీపీ అనుచరులు, మరికొందరు ఉ

ద్యోగులున్నట్లు అంతర్గత సమాచారం.తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారంటూ టీటీడీ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ మురళీకృష్ణ ఫిర్యాదు చేశారు. గత సెప్టెంబర్ 25న తిరుపతి తూర్పు పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెల్సిందే. సీబీఐ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ వీరేశ్ ప్రభు, ఇతర సభ్యులు మూడురోజులుగా వైష్ణవి డెయిరీకి చెందిన సిబ్బందిని విచారించారు. సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు అరెస్టయిన నలుగుర్ని ఆదివారం విచారణకు పిలిచారు. అయితే విచారణలో వీరంతా నీళ్లు నమలడంతో అధికారులు షాకయ్యారు.సీబీఐ సిట్ విచారణలో ఏఆర్ డెయిరీ పేరుతో ఫేక్ డాక్యుమెంట్స్ క్రియేట్ చేశారు. అంతేకాదు రూర్కీలోని భోలే బాబా దగ్గర నుంచి నెయ్యి తెప్పించినట్టు వైష్ణవి డెయిరీ తప్పుడు రికార్డులు క్రియేట్ చేసినట్టు తేలింది. ముఖ్యంగా భోలే బాబా డెయిరీకి ఈ స్థాయిలో నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం లేదని అధికారులు ఓ నిర్ధారణకు వచ్చారు. మూడు డెయిరీలకు చెందిన నలుగురు అరెస్ట్ అయ్యారు.తిరుమల లడ్డూకు నెయ్యి సరఫరా చేసే సమయంలో బిపిన్ జైన్, పోమిల్ జైన్ వైష్ణవి డెయిరీ డైరెక్టర్లుగా ఉన్నట్లు రిమాండ్ రిపోర్టులో సిట్ ప్రస్తావించినట్టు సమాచారం. భోలేబాబా డెయిరీ నుంచి కిలో నెయ్యి రూ.355 లకు కొనుగోలు చేసింది వైష్ణవి డెయిరీ. ఆ తర్వాత ఏఆర్ డెయిరీకి రూ.319 కి సరఫరా చేసినట్టు రికార్డుల్లో ఉంది. ఎక్కువ ధరకు కొనుగోలు చేసి తక్కువకు ఎలా సరఫరా చేశారనేది ఈ కేసులో కీలకమైన పాయింట్. ఇప్పుడు దీనిచుట్టూనే దర్యాప్తు సాగుతోంది.గతేడాది తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీ జరిగిందన్న వార్త దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేగింది. ఏపీ ప్రభుత్వం ప్రత్యేకంగా సిట్ వేయడం, దానిపై అప్పటి వైసీపీ పెద్దలు న్యాయస్థానం తలుపుతట్టారు. చివరకు సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ఐదుగురు సభ్యులతో సిట్ ను ఏర్పాటు చేసింది. అందులో సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ ప్రభుత్వం నుంచి ఇద్దరు, ఫుడ్ సేఫ్టీ స్టాండర్స్ అథారిటీ నుంచి డాక్టర్ సత్యేన్ కుమార్ పాండా సభ్యులుగా ఉన్నారు.

ఏంది చిరు ప్రజారాజ్యం జనసేన అయ్యిందా?

హైదరాబాద్,రాజకీయాలు వద్దు. సినిమాలు ముద్దు. రాజకీయాల గురించి మాట్లాడను అంటూ భీష్మించుకున్న ఆయన.. తన తమ్ముడు పవన్ కల్యాణ్ జనసేన పార్టీని పెట్టి.. ఒంటరిగా పోరాటం చేసిన సందర్భంలోనూ మాట వరసకు రాజకీయాల గురించి మాట్లాడటం.. జనసేన వెంట మెగా అభిమానులు అంతా ఉండాలని ఒక్క రోజున.. ఒక్క మాట మాట్లాడని మెగాస్టార్.. అందుకు భిన్నంగా తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజారాజ్యం పార్టీ జనసేనగా రూపాంతరం చెందిందని.. అందుకు తనకు సంతోషంగా ఉందన్న ఆయన..తొలిసారి జై జనసేన అంటూ నినాదం చేసిన వైనం సంచలనంగా మారింది.ఈ సరికొత్త పరిణామానికి విష్వక్ సేన్ హీరోగా నటించిన లైలా చిత్ర వేదుక వేదికైంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్ కు హాజరైన చిరంజీవి.. తన ప్రజారాజ్యం పార్టీ అంశాల్ని ప్రస్తావించారు. విష్వక్ సేన్ తండ్రి కరాటే రాజుతో తనకున్న అనుబంధానని గుర్తు చేసుకున్న సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మేం ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు రాజకీయంగా ఎదగాలనే తన కోరికను కరాటే రాజు నా దగ్గర ప్రస్తావించారు. దాంతో ప్రజారాజ్యం తరఫున అవకాశం ఇచ్చాం. కానీ అప్పట్లో పరిస్థితులు ఇంకోలా ఉన్నాయి" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇప్పుడున్న జనసేన.. ప్రజారాజ్యమన్న చిరంజీవి వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.పవన్ ఏర్పాటు చేసిన జనసేన పార్టీ విషయంలో చిరంజీవి విముఖంగా ఉండటం తెలిసిందే. ఆ మాటకు వస్తే తమ్ముడు రిస్కు చేస్తున్న వైనంలో ఆయన టెన్షన్ పడ్డారు. ఆ మాటకు వస్తే.. పవన్ కల్యాణ్ పార్టీ పెట్టి.. తన రాజకీయ ప్రత్యర్థులతో యుద్ధమే చేసిన సందర్భంలో అన్నగా ఎప్పుడూ తమ్ముడి వెనుక ఉన్నది లేదు. తమ్ముడు పవన్ కు అనుకూలంగా ఒక ట్వీట్ చేసింది లేదు. అలాంటిది ఇప్పుడు మాత్రం తాను పెట్టిన ప్రజారాజ్యమే ఇప్పటి జనసేన అన్న వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. రాజకీయాల గురించి మాట్లాడనన్న చిరు.. ఆ మాట మీద ఉంటేనే బాగుంటుందేమో?

అవినీతిని అంతం చేస్తానంటూ.. అవినీతి ఆరోపణలతోనే పతనం..

న్యూఢిల్లీ,ఢిల్లీలో ఊపిరి పోసుకున్న అమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ పార్టీగా ఎదిగి పంజాబ్ లో అధికారం కైవసం చేసుకుని 12ఏళ్లు ఢిల్లీని పరిపాలించి అవమానకర పరిస్థితుల్లో అధికారాన్ని కోల్పోయింది. కాంగ్రెస్, బీజేపీ లను వ్యతిరేకించిన పార్టీగా, అవినీతిని దనుమాడుతామంటూ రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఆప్ ఆ తరువాత రాజకీయ పరమపద సోపానపటంలో అవినీతి అనే పెద్ద పాము చేతిని చిక్కి పతనమైంది. అవినీతిపై పోరాటం అన్న నినాదాన్ని పక్కన పెట్టి స్వయంగా అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయింది. అలాగే రాజకీయ చదరంగం కూడా ఆడి ఆ ఆటలో బీజేపీ ఎత్తులకు చిత్తైపోయింది. బీజేపీ వ్యతిరేక కూటమి అయిన ఇండియా కూటమిలో భాగస్వామి అయి కూడా తాజా ఎన్నికలలో ఒంటరిగా బరిలోకి దిగి.. చేజేతులా ఇండియా కూటమి ఓట్లు చీలి తన ఓటమికి కారణమయ్యేలా చేసుకుంది. దశాబ్దానికి పైగా ఢిల్లీలో అధికారంలో ఉండి కూడా కనీసం సౌకర్యాల కల్పనలో విఫలమైంది. ఉచితాలనే నమ్ముకుని బొక్కబోర్లా పడింది. ఆప్ 2012లో పుట్టి,2013 ఢిల్లీ ఎన్నికల్లో మొదటిసారి కాంగ్రెస్ మద్దతుతో అధికారంలోకి వచ్చింది. 2015లో జరిగిన ఎన్నికల్లో 70 స్థానాలకు గాను 67 స్థానాలు కైవసం అఖండ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. ఐదేళ్ల తరువాత .2020 లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో కూడా కూడా62 స్థానాలు సాధించి సత్తా చాటుకుని అధికారాన్ని నిలబెట్టుకుంది. అయితే మళ్లీ ఐదేళ్లు గిర్రున తిరిగే సరికి ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుని పరాజయం పాలైంది. 26 ఏళ్లుగా బీజేపీకి అందని ద్రాక్షలా నిలిచిన హస్తిన పీఠాన్ని పువ్వుల్లో పెట్టి మరీ ఆ పార్టీకి ఈ సారి బీజేపీ 48 స్థానాలు కైవసం చేసుకుని అధికార పగ్గాలు అందుకుంది. ఈ పరాజయానికి ఆప్ స్వయంకృతాపరాధమే కారణమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ పరాజయంతో ఆప్ తాను స్వయంగా ఓడిపోవడమే కాకుండా.. ఇండియా కూటమి ఐక్యతను కూడా ప్రశ్నార్థకం చేసింది.మిత్రధర్మాన్ని పాటించడానికి అహంకారంతో అంగీకరించకపోవడం కారణంగా, అంటే కాంగ్రెస్ తో పొత్తు నిరాకరించడం కారణంగా ఆప్ కనీసం 14 స్థానాలలో స్వల్ప తేడాతో ఓడిపోయి ంది. ఆప్ పార్టీకి పోలైన ఓట్ల శాతం చూస్తే ఇది స్పష్టంగా అర్థమౌతుంది. కాంగ్రెస్ కు పోలైన 7 శాతం ఓట్లు ఆప్ ఓటమిని లిఖించాయి. అన్నిటికీ మించి.ఈ ఎన్నికల్లో ఆప్ అధినేత అరవింద్ క్రేజీవాల్,ఆ పార్టీ కీలక నేత, మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కూడా పరాజయం పాల య్యారు. ఢిల్లీలో దెబ్బతిన్న రహదారులు, పై ఒవర్లపై గుంతలు, తాగునీటి సమస్య .యమున జలాలను శుద్ధి చేస్తామని ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించడం, ఎన్నికలకు ముందు ఆ యమునా జలాలను కలుషితం చేస్తున్నది హర్యానాలోని బీజేపీ సర్కార్ అంటూ ఆరోపణలు చేసి అభాసుపాలు కావడం ప్రధాన కారణాలు గా చెప్పవచ్చు. అలాగే ఢిల్లీలో పేరుకుపోతున్న చెత్త కూడా ఆప్ ను ప్రజలు ఊద్చేయడానికి ఒక కారణంగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇప్పటి వరకూ ఆప్ తన పరాజయాన్ని తానే ఎలా శాశించుకుందో చెప్పుకున్నాం. ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ ఆధిపత్యానికి పకడ్బందీ వ్యూహాలతో, ప్రణాళికా బద్ధంగా బీజేపీ ఎలా చెక్ పెట్టిందో చెప్పుకుందాం. అవినీతిపై అలుపెరుగని పోరాటం అంటూ మొదలైన కేజ్రీవాల్.. ఆమ్ ఆద్మీ పార్టీని దేశ వ్యాప్తంగా విస్తరించాలని ప్రణాళికలు రూపొందించారు. ఆ దిశగా గత పదేళ్లుగా అడుగులు వేశారు. పంజాబ్ లో అధికార పగ్గాలు ఆప్ చేతికి దక్కాయి. కానీ బీజేపీ ఆయన ఆశలకు, ఆకాంక్షలకు కళ్లెం వేసింది. సొంత రాష్ట్రంలోనే ఆప్ ను ఓడించింది. ఇందు కోసం ఆప్ లో చీలిక తీసుకువచ్చింది. పార్టీ నేతలను, క్యాడర్ ను పట్టించుకోకుండా వ్యవహరించిన కేజ్రీవాల్ పై సొంత పార్టీలోనే తీవ్ర అసంతృప్తి వ్యక్తం అయ్యేలా చేసింది. ముఖ్యంగా ఒకప్పుడు కేజ్రీవాల్ పార్టీలో కీలకంగా ఉన్న స్వాతి మలివాల్..ఆయనకు బద్ధ వ్యతిరేకిగా మారారు. ఆప్ నాయకుడు, కేజ్రీవాల్ సన్నిహితుడు తనపై దాడికి పాల్పడినా కేజ్రీవాల్ పట్టించుకోకపోవడమే స్వాతి మలివాల్ పార్టీలో రెబల్ గా మారడానికి కారణం. మౌలికసదుపాయాలు కల్పించడంలో విఫలమైన క్రేజీ వాల్ అనే నినాదాన్ని హైలైట్ చేసారు. క్రేజీవాల్ ఓటమిని సోషల్ మీడియాలో మహాభారతం లో "ద్రౌపతి వస్త్రాపహరణం"పోస్టర్ పెట్టి తన ఆక్రోశాన్ని తీర్చుకున్నారంటే పార్టీలో ఆయన పట్ల ఎంత వ్యతిరేకత గూడు కట్టుకుందో అర్థం చేసుకోవచ్చు. అంతే కాదు కేజ్రీవాల్ అహంకారాన్ని రావణాసురుడి గర్వంతో పోల్చారు. అధికార,ధన దాహం, అవినీతి ఆప్ నైజం అంటూ బీజేపీ చేసిన ప్రచారం క్షేత్రస్థాయిలోకి వెళ్లిపోయింది.

సీఎం రేవంత్ కొత్త పిలుపు.. దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాలి.. ఎందుకు?

హైదరాబాద్,సంచలన వ్యాఖ్యలు చేశారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఇప్పటివరకు ప్రధాని నరేంద్ర మోడీపై విమర్శలు చేసినా.. అవన్నీ కూడా పరిమితులకు లోబడి మాత్రమే. అందుకు భిన్నంగా ఆదివారం మాత్రం ఆయన వాయిస్ లో తేడా వచ్చేసింది. కేరళలోని తిరువనంతపురంలో జరిగిన మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాతృభూమి ఎడిటర్.. ఆహూతుల ప్రశ్నలకు తనదైన శైలిలో జవాబులు ఇచ్చారు. ఈ సందర్భంగా దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాలంటూ కొత్త డిమాండ్ ను తెర మీదకు తీసుకొచ్చారు. ఈ వ్యాఖ్యలతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ముఖాముఖి యుద్ధానికి తెరతీశారని చెప్పాలి.ఇప్పటివరకు మోడీపై యుద్ధాన్ని పలువురు ముఖ్యమంత్రులు చేపట్టారు. దక్షిణాది వరకు వచ్చినా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం మోడీ సర్కారుపై ఒక దశలో దునుమాడారు. తర్వాతి కాలంలో వారిద్దరూ తగ్గారు. తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. ఆయన కుమారుడు కేటీఆర్ ఇద్దరూ ప్రధాని నరేంద్ర మోడీపైనా.. ఆయన ప్రభుత్వంపైనా డైలీ బేసిస్ లో విమర్శలు చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సైతం మోడీ సర్కారుపై విమర్శలు చేయటం చూశాం.వీరికి భిన్నంగా.. దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాలని.. లేకుంటే సౌత్ కు ప్రమాదం పొంచి ఉందన్న కొత్త అంశాన్ని తెర మీదకు తీసుకొచ్చిన ఘనత రేవంత్ కు మాత్రమే దక్కుతుంది. ఇంతకూ ఆయన వాదన ఏమిటన్నది ఆయన మాటల్లోనే చూస్తే.. "రాజ్యాంగపరమైన సాధనకు దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాలి. జనాభా దామాషా పద్ధతిలో నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రంలోనిమోడీ సర్కారు చేస్తున్నప్రయత్నాలను తిప్పికొట్టాలి. జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరిగితే..దక్షిణాది రాష్ట్రాలకు లోక్ సభలో స్థానాలు తగ్గుతాయి. బిహార్.. మధ్యప్రదేశ్.. రాజస్థాన్.. ఉత్తరప్రదేశ్ వంటి బిమారు రాష్ట్రాల్లో గెలిచే సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయొచ్చు. దక్షిణాది రాష్ట్రాలపై ఆధారపడాల్సిన అవసరమే పార్టీలకు ఉండదు" అంటూ తనదైనశైలిలో వారదనను వినిపించారు.కుటుంబ నియంత్రణను పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షిస్తారా? అంటూ ప్రశ్నించిన రేవంత్.. ఈ చర్య ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బ తీస్తుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా లెక్కల ప్రకారం కాకుండా.. ప్రతి రాష్ట్రానికి 50 శాతం సీట్లను పెంచాలన్న సీఎం రేవంత్.. "దీంతో అన్ని రాష్ట్రాల్లో సీట్లు పెరుగుతాయి. ఇదే సూచనను ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లాం. ఒకే దేశం.. ఒకే ఎన్నికల విధానానికి మేం వ్యతిరేకం.